

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 26 అక్టోబరు 2021 సంపుటి : 03 సంచిక : 72 పేజీలు : 4 వెల : రూ 3-00


# 'ఆయుష్మాన్ భారత్' మిషన్ ప్రారంభం



వారణాసి : ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మౌలిక సదుపాయాల మిషన్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసిలో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ పథకం భారత దేశ ఆరోగ్య రంగంలో ఆత్మవిశ్వాసాన్ని, స్వయంసమృద్ధిని నింపుతుందన్నారు. దేశ ఆరోగ్య సదుపాయాలకు నూతన జవసత్వాలు వస్తాయన్నారు. ఈ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అతి పెద్ద, అత్యుత్తమ పెట్టుబడులలో ఒకటి ఆరోగ్య రంగంలో పెట్టుబడులని మనం ఎప్పుడూ విశ్వసిస్తామని చెప్పారు. కోవిడ్-19 మహమ్మారిపై పోరాటంలో 100 కోట్ల వ్యాక్సిన్ డోసుల పంపిణీ మైలురాయిని దాటినందుకు భారత దేశాన్ని మోదీ అభినందించారు. కాశీ విశ్వనాథుడు, గంగమ్మ తల్లి, కాశీ ప్రజల ఆశీర్వాదాల వల్ల 'అందరికీ టీకా, ఉచిత టీకా' కార్యక్రమం విజయవంతంగా సాగుతోందన్నారు. దీపావళి, ఛాత్ తదితర పండుగలను దేశమంతా సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ, శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు మోదీ ఉత్తర ప్రదేశ్‌లోని సిద్ధార్థ నగర్ నుంచి తొమ్మిది వైద్య కళాశాలలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, గవర్నర్ ఆనందిబెన్ పటేల్, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ పాల్గొన్నారు. పీఎం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మౌలిక సదుపాయాల మిషన్‌ను వారణాసి నుంచి ప్రారంభించినందుకు మోదీకి యోగి ఆదిత్యనాథ్ ధన్యవాదాలు తెలిపారు. మోదీ వారణాసి నుంచి లోక్‌సభ సభ్యునిగా ఎన్నికైన సంగతి తెలిసిందే.

# ఎయిడెడ్ విద్యాసంస్థల అప్పగింతలో ఎలాంటి బలవంతం లేదు: సీఎం జగన్




తాడేపల్లి: ఉన్నత విద్యపై తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్షా సమావేశం చేపట్టారు. ఈ సమావేశానికి విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. సమీక్షలో చర్చించిన అంశాలు..

మైక్రోసాఫ్ట్‌లాంటి సంస్థలతో శిక్షణ అన్నది నిరంతరం కొనసాగాలి. కోర్సుల్లో శిక్షణను ఇంటిగ్రేట్‌చేయాలి. అప్పుడు ఉద్యోగావకాశాలు మరింతగా మెరుగుపడతాయి. ఎడ్యుకేషనల్‌గా మనం వచ్చిన తర్వాత తేడా ఏంటి అన్నది కనిపించాలి. ఉద్యోగాల కల్పన దిశగా చదువులు ఉండాలి. జాబ్‌ఓరియెంటెడ్‌గా మన కోర్సులను తీర్చిదిద్దాలి. ఈ ప్రభుత్వం వచ్చాక ఉన్నత విద్యలో, కోర్సుల్లో కూడా చాలా మార్పులు తీసుకు వచ్చాం. చదువులున్నా.. ఇంటర్వ్యూల దగ్గరకు వచ్చేసరికి విఫలం అవుతున్న పరిస్థితులు చూస్తున్నాం. అప్రెంటిస్‌షిప్ కచ్చితంగా ఉండాలి. ప్రతి పార్లమెంటు స్థానంలో ఒక నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని తీసుకు వస్తున్నాం. సర్టిఫైడ్‌కోర్సులను కరికులమ్‌లో భాగంగా చేయాలి. ఆయా రంగాల్లో నిపుణులైన, అత్యుత్తమమైన వ్యక్తులతో కోర్సులను రూపొందించండి. చదువులు అయిపోయిన తర్వాత కచ్చితంగా జాబ్‌వస్తుందనే విశ్వాసం, నమ్మకం ఉండాలి. యూనివర్శిటీల్లో టీచింగ్‌స్టాఫ్‌ను రిక్రూట్‌చేయమని ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్‌ఇచ్చాం. టీచింగ్‌స్టాఫ్‌లేనప్పుడు యూనివర్శిటీలు ఉన్నా.. లాభం ఏంటి. రిక్రూట్‌మెంట్‌లో పక్షపాతాలకు తావుండకూడదు. టీచింగ్‌స్టాఫ్‌లో క్వాలిటీ ఉండాలి. క్వాలిటీ లేకపోతే.. రిక్రూట్‌చేసినా అర్థం ఉండదు. అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలి. అత్యంత పారదర్శకంగా నియమాకాలు సాగాలి. క్వాలిటీ ఎడ్యుకేషన్‌కోసం పాఠ్యప్రణాళికలో మార్పులు తీసుకురావాలి. ప్రాక్టికాలిటీకి పెద్దపీట వేయాలి. జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆస్పత్రులను తీర్చిదిద్దుతున్నాంఆస్పత్రులను జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నాం. అలాగే ప్రతి యూనివర్శిటీ పరిధిలోకూడా జాతీయ ప్రమాణాలు ఉండాలి. కాలేజీలన్నీ కూడా ఆయా ప్రమాణాలు పాటించేలా చూడాలి. ఎన్ని సమస్యలున్నా సరే.. ఫీజు రియింబర్స్‌మెంట్‌విషయంలో ఎక్కడా లోటు చేయడంలేదు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కచ్చితంగా జీతాలు ఇస్తున్నాం. ఫీజు రియింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంవల్ల సిబ్బందికి జీతాలు ఇవ్వలేకపోతున్నామనే మాట యాజమాన్యాలనుంచి రాకుండా చూసుకుంటున్నాం. తల్లుల అకౌంట్లోకి నేరుగా డబ్బులు వేస్తున్నాం. కాలేజీల్లో పరిస్థితులపై నేరుగా వారు ప్రశ్నిస్తున్నారు. యూనివర్శిటీకి సంబంధించిన ప్రభుత్వ కాలేజీల్లో కూడా ఫీజురియింబర్స్‌మెంట్‌ఫీజులు కూడా ఇస్తాం. ఇతర ప్రైవేటు కాలేజీల్లానే సమానంగా ఫీజులు చెల్లిస్తాం. దీనివల్ల ఆర్థికంగా యూనివర్శిటీలు స్వయం స్వయంసమృద్ధి సాధిస్తాయి. నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు యూనివర్శిటీలతో ఇంటిగ్రేడ్ కావాలిపరిశోధనలమీద కూడా కొలాబరేట్‌చేసుకోవాలి. జిల్లాల్లో పరిశ్రమలతో అనుసంధానం చేసుకోవాలి. ఒక్కో యూనివర్శిటీలో ఒక్కో రంగానికి సంబంధించి పరిశోధనలు జరిగేలా పరిశ్రమలతో కొలాబరేట్‌కావాలి. ప్రతి వారం ఒక వీసీని పిలిపించుకుని... యూనివర్శిటీల్లో సమస్యలు, ప్రభుత్వ పరంగా అందించాల్సిన తోడ్పాటుపై కలిసి కూర్చొని చర్చించాలి. ఆ సమావేశంలో గుర్తించినా అంశాలను నా దృష్టికి తీసుకురావాలి. తర్వాత యూనివర్శిటీ వారీగా లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. వచ్చే మూడు సంవత్సరాల కాలానికి కార్యాచరణ రూపొందించి మూడేళ్లలో విజన్ సాధించాలి. అన్నియూనివర్శిటీల్లో నాక్‌రేటింగ్ అప్‌గ్రేడ్ కావాలి. నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు యూనివర్శిటీలతో ఇంటిగ్రేడ్ కావాలి. ఆన్‌లైన్‌లో కూడా స్కిల్‌డెవలప్‌మెంట్‌కోర్సులను ఉంచాలి. ఇంగ్లీషును మెరుగుపరచడంపైనా దృష్టిపెట్టాలి. బేసిక్‌ఇంగ్లీష్ అన్నది తప్పనిసరి సబ్జెక్టుగా పెట్టాలి. దీనివల్ల ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయి. వచ్చే నాలుగేళ్లపాటు రెండు భాషల్లో టెక్ట్స్‌బుక్స్‌తెలుగు మీడియం నుంచి ఇంగ్లిషు మాధ్యమంలోకి విద్యార్థులు మారేటప్పుడు వారికి సౌలభ్యంగా ఉండటానికి రెండు భాషల్లో కూడా పాఠ్యపుస్తకాలు రూపొందించాలన్న సీఎం.. వచ్చే నాలుగేళ్లపాటు రెండు భాషల్లో టెక్ట్స్‌బుక్స్ అందించాలని తెలిపారు. "ఈ ప్రభుత్వం చదువకు ఇచ్చిన ప్రాధాన్యత మరే ప్రభుత్వమూ ఇవ్వలేదు. నాణ్యమైన విద్య ఇవ్వడానికే అనేక చర్యలు తీసుకున్నాం. మంచి చదువులతో కుటుంబాల తలరాతలు మారుతాయి" అని సీఎం జగన్ తెలిపారు

# ఏపీ భేష్.. జాతీయ స్థాయి సమీక్షలో ప్రశంసించిన కేంద్రం

## ఇంధన సామర్థ్యంలో ఏపీ భేష్




అమరావతి: ఇంధన సామర్థ్య కార్యక్రమాలను ప్రోత్సహించడం, అమలు చేయడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యద్భుత పనితీరు కనబరుస్తోందని కేంద్ర విద్యుత్ శాఖ పేర్కొంది. ఇంధన పొదుపులో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని ప్రశంసించింది. ఇంధన సామర్థ్య కార్యక్రమాలపై బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియోన్సీ (బీఈఈ) ఆధ్వర్యంలో కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్ అధ్యక్షతన అన్ని రాష్ట్రాలతో జాతీయస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆ వివరాలను రాష్ట్ర ఇంధన పర్యవేక్షక మిషన్ సీఈఓ ఎ. చంద్రశేఖర రెడ్డి ఆదివారం వెల్లడించారు.

# కాకినాడ మేయర్‌గా సుంకర శివప్రసన్న ఏకగ్రీవ ఎన్నిక

తూర్పుగోదావరి: కాకినాడ మేయర్‌గా సుంకర శివప్రసన్న, డిప్యూటీ మేయర్‌గా మీసాల ఉదయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మేయర్ ఎన్నికకు టీడీపీ కార్పొరేటర్లు హాజరుకాలేదు. ఎన్నిక అనంతరం మేయర్ శివప్రసన్న మీడియాతో మాట్లాడుతూ, కాకినాడ నగర అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. సహచర కార్పొరేటర్ల సహకారం ఎప్పటికప్పుడు తీసుకుంటానన్నారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకూ మేయర్‌గా ఉన్న సుంకర పావనిపై మెజార్టీ కార్పొరేటర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో.. ఆమెను తొలగిస్తూ ప్రభుత్వం ఈ నెల 12న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఖాళీగా ఉన్న మేయర్, డిప్యూటీ మేయర్ పదవులకు నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఈ రోజు ఉదయం ఎన్నికలు నిర్వహించారు.

సీఎం జగన్ సామాజిక న్యాయం: మంత్రి కన్నబాబు

సీఎం వైఎస్ జగన్ సామాజిక న్యాయం పాటిస్తూ బలహీనవర్గాలకు రాజకీయ పదవులు ఇస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. కాకినాడ



కౌన్సిల్ రెండు డిప్యూటీ మేయర్ పదవులను మత్స్యకార, రెల్లి సామాజిక వర్గాలకు ఇచ్చారన్నారు. మాటలతో కాకుండా చేతలతో చేసి చూపించే సీఎం.. వైఎస్ జగన్ అని కన్నబాబు అన్నారు.

ఇది కార్పొరేటర్ల విజయం: ఎమ్మెల్యే ద్వారంపూడి

మేయర్ల ఎన్నిక కార్పొరేటర్ల విజయం అని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సీఎం జగన్ భావాలకు అనుగుణంగా మేయర్‌గా ఒక మహిళను, రెండు డిప్యూటీ మేయర్ పదవులకు ఒక బీసీ( మత్స్యకార), ఎస్సీ(రెల్లి) కార్పొరేటర్లను ఎన్నుకున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

# పదవి కోసమే ఆదినారాయణరెడ్డి ఆరోపణలు: గడికోట శ్రీకాంత్‌రెడ్డి



వైఎస్సార్ జిల్లా: ఆదినారాయణ రెడ్డి ఆరోపణలు కేవలం కేంద్రంలో పదవి కోసమే.. రాజకీయ ప్రయోజనాల కోసం రాజకీయ భిక్ష పెట్టినవారిపై ఆరోపణలు చేయడం తగదు. స్వప్రయోజనాల కోసం సంస్కారం మరిచిపోవద్దు అని ఆంధ్రప్రదేశ్ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. "ప్రజాస్వామ్యంలో ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడగడం రాజకీయ పార్టీల బాధ్యత. కేంద్రంలో అధికారం ఉన్నామన్న గర్వంతో బీజేపీ ప్రజలను ఓట్లు అడగకుండా పత్రిక సమావేశాలకు పరిమితం అయ్యింది. ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం ఇది చెయ్యలేదని ప్రశ్నించలేని పరిస్థితి బీజేపీది" అని విమర్శించారు. "బీజేపీ నేతలు మంది మార్బలంతో వచ్చి అధికారులపై ఆరోపణలు చేస్తున్నారు. మాకు ప్రజా బలం ఉంది, పోలీసులు అవసరం లేదు. నిష్పక్షపాత ఎన్నికలు జరగాలని మేము కూడా కోరుకుంటున్నాం. విభజన చట్టంలో హామీలు నేరవేరిస్తే పోటీ నుంచి విరమించుకుంటాం. ప్రత్యేక హోదా, దుగ్గరాజపట్నం, స్టీల్ ప్లాంట్ ఇస్తే పోటీ నుంచి విరమించుకుంటాం. రాష్ట్ర ప్రయోజనాల కోసం త్యాగం చేస్తాం. వ్యక్తిగతంగా దూషణలు, ఆరోపణలు చేయడం సంస్కారం కాదు. ప్రత్యేక హోదా ఇస్తామని స్వయంగా ప్రధాని చెప్పారు" అని తెలిపారు. "సోమశిల నిర్వాసితులకు అన్నివిధాల న్యాయం చేస్తాం. ప్రతి రైతుకు 6 నుంచి 10 లక్షలు నష్టపరిహారం ఇచ్చిన ఘనత వైఎస్సార్‌ది. సోమశిల విషయంలో పెండింగ్‌లో ఉన్న 19 వేల అప్లికేషన్లలో అర్హులైన అందరికి ఒన్ టైం సెటిల్ మెంట్ చేశాం అని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. "మా ప్రభుత్వంపై చంద్రబాబు కావాలని బురద జల్లుతున్నారు. చంద్రబాబు లాగా.. మేము అధికార దుర్వినియోగానికి పాల్పడలేదు. ప్రజాబలం ఉన్నప్పుడు మాకు ఇంకో బలం అవసరంలేదు. టీడీపీ ఢిల్లీ పర్యటన గురించి మాట్లాడ్డం అనవసరం. మోడీ అంతు తెలుస్తానని చెప్పిన చంద్ర బాబు తరువాత వంగి వంగి దండాలు పెట్టారు.. ఏదోరకంగా ప్రచారం కావాలని టీడీపీ కోరుకుంటున్నారు.. చంద్రబాబు గురించి అందరికి తెలుసు" అన్నారు.

## రేషన్ షాపుల బంద్‌కు రేషన్ డీలర్ల అసోసియేషన్ నేతల పిలుపు

అమరావతి: ప్రభుత్వం తీరుతో... రేషన్ షాపుల బంద్‌కు రేషన్ డీలర్ల అసోసియేషన్ నేతలు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా రేపటి నుంచి రేషన్ పంపిణీ నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. 2020 పియంజికెఎవై కమిషన్ బకాయిలు ఇవ్వాలన్నారు. డీలర్ల నుండి ఐసిడిస్ కు మళ్ళించిన కందిపప్పు డబ్బు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. గోనె సంచులను ప్రభుత్వానికి ఇస్తే 20 రూపాయలు ఇస్తామని సర్క్యులర్ ఇచ్చారని పేర్కొన్నారు. ఇప్పుడు చెల్లింపు చేయబోమని చెప్పడం ఎంతవరకు సబబు?అని ప్రశ్నించారు. గోనెసంచులు ఇవ్వకుంటే ఎలాట్మెంట్ కట్ చేస్తామని అధికారులతో కేసు లు పెడతామని హెచ్చరించడం తగదన్నారు. గోనెసంచులు ప్రభుత్వం తీసుకునేలా ఇచ్చిన జీవో 10 పక్క రాష్ట్రం తెలంగాణలో అమలు చేస్తున్నారని చెప్పారు. మన రాష్ట్రంలో కూడా నిలుపుదల చేయకుండా అమలు చేయాలని సూచించారు.

# రాయలసీమకు చంద్రబాబు చేసిందేమిటి? : మంత్రి అనిల్



నెల్లూరు: పోలవరం ప్రాజెక్టులో చంద్రబాబు కమిషన్ల కోసం కక్కుర్తి పడ్డారని ఏపీ నీటిపారుదలశాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాయలసీమకు చంద్రబాబు చేసిందేమిటని ప్రశ్నించారు. ఐదేళ్ల పాలన కాలంలో బాబు.. ఒక్క ప్రాజెక్ట్ అయినా కట్టారా? అని మండిపడ్డారు. తమ ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం వెలిగొండను పూర్తిచేయనుందని అన్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి రామోజీకి కనిపించడంలేదా అని ఎద్దేవా చేశారు. కులాలు, ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించి బాబు దిగజారిన రాజకీయాలు చే?స్తున్నారని మంత్రి అనిల్ విమర్శించారు. అదే విధంగా.. ఏపీలో అమలవుతున్న సంక్షేమ పథకాలు తెలంగాణలో ఉన్నాయా? అని మంత్రి అనిల్ ప్రశ్నించారు. ఏపీలో ప్రతి పథకం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని అన్నారు. తెలంగాణ స్కూళ్లకు వెళ్దాం.. ఏపీ స్కూళ్లకు వెళ్దాం.. ఎక్కడ అభివృద్ధి జరిగిందో చూడండని మంత్రి అనిల్ కుమార్ అన్నారు. తమ ప్రభుత్వం ఒకేసారి లక్షన్నర ఉద్యోగాలను భర్తీ చేసిందని స్పష్టం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీడీపీ కార్యకర్తను పరామర్శించిన భూమ బ్రహ్మానందరెడ్డి

గోసుపాడు గోసుపాడు మండలం రాయపాడు గ్రామ నివాసి తెలుగుదేశం పార్టీ నాయకులు అకే పోగు శ్రీనివాసుల కుమారుడు చిరంజీవి బైక్ అక్సిడెంట్ జరిగిన వెంటనే శాంతిరామ్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి వెంటనే శాంతిరామ్ హాస్పిటల్ కు వెళ్లి పరామర్శించారు.

# ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం మాఫియా: చంద్రబాబు


న్యూఢిల్లీ: ఏపీలో మద్యపాన నిషేధమని చెప్పి జగన్‌రెడ్డి సొంత వ్యాపారం చేస్తున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. సోమవారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం



మాఫియా నడుస్తోందని ఆరోపించారు. డ్రగ్స్‌తో యువత నిర్వీర్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ కంట్రోల్ చేయమని అడిగితే ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. జగన్ గత రెండేళ్లుగా రాజ్యాంగ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని చంద్రబాబు విమర్శించారు. రాష్ట్రంలో అన్ని రాజ్యాంగ వ్యవస్థలపై దాడులు జరుగుతున్నాయన్నారు. వైసీపీ శ్రేణులు హైకోర్టు జడ్జిలపై కామెంట్లు చేస్తూ పోస్టులు పెడుతున్నారన్నారు. చివరికి పార్లమెంట్ సభ్యుడిపై కూడా పోలీసులు చేయి చేసుకున్నారని చంద్రబాబు పేర్కొన్నారు.

# ఏపీలో కొత్తగా 295 కరోనా కేసులు

అమరావతి: రాష్ట్రంలోని కరోనా పరిస్థితులపై అధికారులు ప్రకటన విడుదల చేసారు. ఏపీలో కొత్తగా 295 కరోనా కేసులు నమోదయ్యాయి. కరోనాతో ఏడుగురు మృతి చెందారు. ఏపీలో మొత్తం 20,63,872 కరోనా కేసులు నమోదయ్యాయి. ఏపీలో 4,830 కరోనా యాక్టివ్



కేసులు ఉన్నాయి. కరోనాతో రాష్ట్రంలో ఇప్పటివరకు మొత్తం 14,350 మృతి చెందారు.


## సంపాదకీయం

మంగళవారం 26 అక్టోబరు 2021

# అచ్చేదిన్ ఎప్పుడు

దేశవ్యాప్తంగా కరోనా కేసులు తగ్గుతున్నా.. పెట్రోల్, డీజిల్ ధరలు మాత్రం పెరుగుతూనే వున్నాయి. సెప్టెంబర్ 28 నుంచి పెట్రోల్ ధరలు 19 సార్లు పెరిగిందంటే పరిస్థితి ఎలా వుందో అర్థం చేసుకోవచ్చు. గడిచిన మూడు వారాల్లో లీటర్ పెట్రోల్ పై 5 రూపాయల 7 పైసలు పెరిగింది. ఇక సెప్టెంబర్ 24 నుంచి డీజిల్ ధరలు 22 సార్లు పెరిగాయి. లీటర్ డీజిల్ పై గడిచిన మూడు వారాల్లోనే 7 రూపాయలు పెరిగింది. హైదరాబాద్ లో లీటర్ పెట్రోల్ ధర రూ. 111.55 పైసలుండగా.. డీజిల్ ధర రూ. 104.70గా ఉంది. పెరిగిన పెట్రోల్,డీజిల్ ధరలతో సామాన్యుడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. వీటికి తోడు కూరగాయల ధరలు కూడా మండిపోతున్నాయి. టమోటా ధర కాస్త తగ్గినా.. మిగిలిన కూరగాయలు, ముఖ్యంగా ఉల్లి ధర పెరగడం సామాన్యులకు కష్టాలు తెచ్చిపెడుతోంది. గృహిణులకు వంటింట్లో కన్నీళ్ళు వస్తున్నాయి. ఎలా కొనాలి, ఎలా తినాలి అంటున్నారు. హైదరాబాద్‌లో గ్యాస్ సిలిండర్ ధరలు మంట పుట్టిస్తున్నాయి. 14.2 కేజీల సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ధర 952 రూపాయలుగా వుంది. గత ఏడాది కాలంగా గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా పెరిగాయో ఒక సారి పరిశీలిస్తే దిమ్మ తిరగకమానదు. ఏడాది క్రితం 646 రూపాయలు వున్న గ్యాస్ సిలిండర్ ధర ఇప్పుడు 306 రూపాయలకు పైగా పెరిగింది. నవంబర్ నాటికి వెయ్యి రూపాయల మార్కుకి చేరడం అంత కష్టమేం కాదు. కానీ ఈ సిలిండర్ బండ మోయలేక మళ్ళీ కట్టెల పొయ్యి వెళతారేమో సామాన్యులు. మోడీజీ జర ఆలోచించండి. కరోనా ఎంట్రీతో ప్రపంచం మొత్తం అతలాకుతలం అవుతున్న సంగతి అందరికీ తెల్సిందే. గత రెండుళ్లుగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తం కుదేలైపోయింది. కరోనా దాటికి లక్షలాది మంది మృత్యువాతపడగా, కోట్లాది మంది ఉద్యోగాల్లేక వీధిన పడ్డారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలను ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు వారిపై మరింత పన్నుల భారం మోపుతుండటం ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా రోజురోజుకు పెరిగిపోతున్న పెట్రోల్, డిజీల్, వంట గ్యాస్ ధరలు సామాన్యుడి జీవితాన్ని ప్రశ్నార్ధకంగా మారుస్తున్నాయి. చమురు కంపెనీలు నష్టాల్లో ఉన్నాయనే సాకుతో కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ ఉత్పత్తులపై ఇష్టారీతిన పన్నులు పెంచుకుంటూ పోతుంది. దీంతో నిత్యావసర ధరల పెరుగుదలకు హద్దు అదుపు లేకుండా పోతోంది. కొన్ని నెలలుగా పెట్రోల్ ధరలు పెరగడమేగానీ తగ్గిన దాఖలాలు లేవు. ప్రతీరోజు 20పైసలు, 30పైసలు, 50పైసల చొప్పున ధరల చొప్పున ప్రభుత్వం పెంచుకుంటూ పోతుంది. జేబులకు చిల్లుపడింది కూడా తెలియకుండానే సామాన్యుడి నడ్డిని విరుస్తోంది. ఇప్పటికే పెట్రోల్, డిజీల్ ధరలు సెంచరీని దాటేశాయి. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో పెట్రోల్ ధర రూ. 110 ఉండగా డిజీల్ ధరలు రూ. 103గా ఉంది. ముఖ్య పట్టణాల్లో ఈ రేటు ఇంకొంచెం ఎక్కువగా ఉంది. అదేవిధంగా వంట గ్యాస్ ధరలు కూడా ప్రతీనెలా మారుతున్నాయి. ప్రస్తుతం వంట గ్యాస్ ధరకు వెయ్యి రూపాయాలకు అటూ ఇటుగా ఉంది. ఈ పరిణామాలన్నీ కూడా సామాన్యుడిపై ప్రభావం చూపుతున్నాయి. అసలే పనుల్లేక పస్తులుంటున్న జనాలపై పెట్రో ఉత్పత్తుల పేరిట పన్నులను పెంచడం శోచనీయంగా మారింది. కరోనా కష్టకాలంలో ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం లక్షల కోట్ల ప్యాకేజీని ప్రకటించింది. ఇది సామాన్యుడికి ఏమేరకు అందిందో తెలియదు గానీ పెట్రో ధరల పెరుగుదలతో సామాన్యుడి జేబుకు మాత్రం చిల్లు పడుతోంది. పెట్రోల్, డిజీల్ ధరలు అందన ఎత్తులోకి వెళ్లిపోవడంతో మోదీ సర్కారుపై ప్రజల్లో ఒక్కింత ఆగ్రహం వ్యక్తమవుతోంది. దీంతో మోదీ ఇమేజ్ క్రమంగా మసకబారుతుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ పరిణామాలపై మోదీ సర్కార్ సైతం బెంబేలెత్తిపోతుంది. ఇక త్వరలోనే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటంతో మోదీ సర్కార్ అలర్ట్ అవుతోంది. పెట్రోల్, డిజీల్ ధరల పెరుగుదల సామాన్యులపై ప్రభావం చూపుతుండటంతో ఆ వ్యతిరేకత వచ్చే ఎన్నికలపై పడకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. పెట్రోల్ ధరలకు కళ్లెంవేసేలా కేంద్ర ఆర్థిక శాఖ పెట్రోలియం శాఖతో సంప్రదింపులు చేస్తోంది. పెట్రోల్, డిజీల్, వంట గ్యాస్ ధరలపై పన్నులు తగ్గించి సాధారణ స్థితికి తీసుకు రావాలని ప్రయత్నం చేస్తోంది. దీనికితోడు ఎన్నికల్లో ప్రజలను ఆకట్టుకునేలా కొత్తకొత్త హామీలు ఇచ్చేందుకు మోదీ సర్కారు రెడీ అవుతోంది. అయితే ఎన్నికల ముందు పెట్రోల్ ధరలు తగ్గించినా ఎన్నికల తర్వాత మళ్లీ పెరగడం ఖాయమనే టాక్ విన్పిస్తోంది. ఏదిఏమైనా గత కొంతకాలంగా పెరుగుతున్న పెట్రోల్ ధరల పెరుగుదలకు రాబోయే అసెంబ్లీ ఎన్నికలు కళ్లెం వేయనుండటం ఒకింత గుడ్ న్యూస్ అనే చెప్పొచ్చు. ప్రజలను మభ్యపెట్టేలా కేంద్ర సర్కారు చేయబోయే మాయజాలం వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచిచూడాల్సిందే..!

# గంటా శ్రీనివాసరావు దారెటు



విశాఖపట్టణం, అక్టోబరు 25, (న్యూస్ పల్స్)రాజకీయ భవిష్యత్‌పై ఎన్నో ఊహాగానాలు, మరెన్నో అంచనాలు వినిపించాయి. కానీ.. హఠాత్తుగా యూటర్న్ తీసుకుని ఇప్పుడు మళ్లీ పార్టీకి విధేయత ప్రకటిస్తున్నారు. ఇంతకీ ఆయనలో వచ్చిన ఈ మార్పునకు కారణం ఏంటి? ఎవరా నాయకుడు?గంటా శ్రీనివాసరావు. విశాఖజిల్లా రాజకీయాల్లో మూడు దశాబ్దాలకుపైగా ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రిగా ఒక వెలుగు వెలిగారు. మిగిలిన రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో వ్యూహాలను మారిస్తే.. గంటా మాత్రం నియోజకవర్గాలను.. పార్టీలను మారుస్తారనే విమర్శ ఉంది. 2019 ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి గెలిచారు. టీడీపీ అధికారం కోల్పోవడంతో ప్రతిపక్ష ఎమ్మెల్యేగానే మిగిలిపోయారు గంటా. నియోజకవర్గ బాధ్యతలను మేనల్లుడి చేతుల్లో పెట్టేసి..కేడర్‌కు, ప్రజలకు దూరం పాటిస్తూ వచ్చారు ఈ మాజీ మంత్రి. రెండేళ్లుగా ఇదే వైఖరిని ప్రదర్శించడంతో గంటా రాజకీయంగా ఎటువైపు వెళతారనేది ఎప్పుడూ చర్చగా ఉండేది. సమయం వచ్చినప్పుడు రాజకీయ భవిష్యత్‌పై చెబుతాను అనేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే గంటా పార్టీ మారిపోతారని ప్రచారం జరిగింది. ఆ దిశగా ఆయన ప్రయత్నాలు చేసినట్టు స్వయంగా అధికారపార్టీ నేతలే చర్చించుకునేవారు. మంత్రి అవంతి శ్రీనివాస్, మరో కీలక నేత వ్యతిరేకించిన కారణంగా గంటాకు వైసీపీలో ఎంట్రీ దక్కలేదనేది మరో ప్రచారం. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేక పోరాటం కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం పెద్ద సంచలనమైంది. రాజీనామాను ఆమోదించాలని గంటా కోరినప్పటికీ ఎటువంటి పురోగతి లేదు. చంద్రబాబుకు చెప్పకుండా రాజీనామా చేయడంతో టీడీపీతో తెగతెంపులు ఖాయమని అనుకున్నారు. ఇప్పుడు గంటా యాక్టివ్ కావడంతో.. గతంలో ఆయన ఎమ్మెల్యేగా పనిచేసిన నియోజకవర్గాల నుంచి నాయకులు వచ్చి మాట్లాడి వెళ్తున్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంత కాపు నాయకులతో మాజీ మంత్రి సమావేశం ఆసక్తిని రేకెత్తించింది. ఇటీవల జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన ప్రకటనపై వీరి మధ్య చర్చ జరిగిందట. దీంతో గంటా చూపు జనసేన వైపు మళ్లిందా అనే ఊహాగానాలు వినిపించాయి. అయితే గంటా ఎక్కడా బయటపడకపోగా టీడీపీకి విధేయతను చాటే ప్రయత్నం చేయడం స్వపక్షానికి, విపక్షనికి కొత్తగా కనిపిస్తోందట. టీడీపీ నేత పట్టాభి కామెంట్స్ అనంతర పరిణామాలపై గంటా స్పందించిన తీరు కొత్తగా ఉందట. పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ వచ్చిన ఆయన.. మరోసారి పార్టీలో చురుగ్గా మారేందుకు ప్రయత్నిస్తున్నారనే సంకేతాలు వెలువడ్డాయి. అధిష్ఠానం బంద్ పాటించమని ఆదేశిస్తే రెస్పాండ్ అయ్యారు గంటా. నియోజకవర్గస్థాయిలో నిరసనలు గట్టిగా జరగాలని నిర్దేశించారు. చంద్రబాబు దీక్షకు బహిరంగ మద్దతు ప్రకటించారు కూడా. గంటా తాజా చర్యలను అధికారపార్టీ ఎండగడుతోంది. ఇంతకాలం జనం గురించి పట్టించుకోని గంటాకు ముఖ్యమంత్రిని దూషించిన వారిని వెనకేసుకుని రావడం ఎంతవరకు సమంజసమో చెప్పాలని బహిరంగ వేదికలపై ప్రశ్నిస్తోంది. వాస్తవానికి గంటా శ్రీనివాస్ తాను ఎప్పుడూ పార్టీ మారతానని కానీ.. ఆ ఉద్దేశం ఉందని కానీ బయటపడలేదు. సమయం వచ్చినప్పుడు చెబుతాను అనే మాట తప్ప బయటపడిన దాఖలాలు లేవు. ఇప్పుడు వేస్తున్న ఎత్తుగడలు చూస్తే వచ్చే ఎన్నికల నాటికి టీడీపీ, జనసేన కలిసి వెళ్తాయనే సంకేతాలు వస్తున్నాయి. దీంతో ఆయన టీడీపీలోనే కొనసాగుతూ.. మరోసారి భీమిలి నుంచి పోటీ చేస్తారని సన్నిహిత వర్గాలు చెప్పుకుంటున్నాయి.

# వివాదాల శ్రీదేవి...

గుంటూరు, అక్టోబరు 25, (న్యూస్ పల్స్)అతి సర్వత్రా వర్జయేత్.. అంటారు. ఒక్కోసారి శృతి మించిన ప్రచారం కూడా వికటిస్తుంది. చేసేది తక్కువ చెప్పుకునేది ఎక్కువగా అన్న ముద్ర పడిపోతే నిజం చెప్పినా జనం నమ్మలేని పరిస్థితికి వస్తుంది. ఇప్పుడు చిలకలూరి పేట ఎమ్మెల్యే విడదల రజనీ కూడా అదే పరిస్థితిని ఎదుర్కొంటుంది. ఆమె అడుగు వేస్తే వెంటనే ఫొటోలో సోషల్ మీడియాలో దర్శనమిస్తాయి. ఆమె కోసం ఏకంగా ఒక టీం పనిచేస్తుంది. అలా సోషల్ మీడియా ద్వారా ఎమ్మెల్యేగా ఎన్నికయిన నాటి నుంచి విడదల రజనీ విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. కరోనా సమయంలోనూ ఆమె చేసింది తక్కువ చెప్పింది ఎక్కువ అన్నట్లు ప్రచారం చేసుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. విడుదల రజనీ ఫేస్ బుక్, వాట్సప్, ట్విటర్ ద్వారా ప్రజల్లో నిత్యం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అప్పుడప్పుడు అధికారులకు వార్నింగ్ లు ఇవ్వడం కూడా కన్పిస్తాయి. ఒకరకంగా చెప్పాలంటే రజనీ ఏ చిన్న పనిచేసినా క్షణాల్లో సామాజిక మాధ్యమాల్లో దర్శనమిస్తాయి. విడుదల రజనీకి ఈ ప్రచారం ఇబ్బంది పెట్టేలా కన్పిస్తుంది. విడదల రజనీ మంత్రి పదవిని ఆశిస్తున్నారు. తొలి సారి గెలిచినప్పటికీ సామాజికవర్గం కోటాలో ఆమె జగన్ కేబినెట్ లో చేరాలనుకుంటున్నారు. గుంటూరు జిల్లాకు జగన్ వస్తే చాలు విడదల రజనీ హడావిడి ఇక చెప్పలేం. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సహకారంతో తనకు మంత్రి పదవి వస్తుందని విడదల రజనీ గట్టిగా విశ్వసిస్తున్నారు. అందుకోసం ఇటీవల కాలంలో ప్రచారాన్ని ఎక్కువగా చేసుకుంటున్నారు. అయితే వివాదాలతో ఆమెకు మంత్రి పదవి దక్కకపోయే ఛాన్సుంది. విడదల రజనీ స్థానికంగా మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ తో సఖ్యత లేదు. అలాగే నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలతో కూడా పొసగడం లేదు. కమ్మ సామాజికవర్గం నేతలతో గొడవలు ఆమెను పదవికి దూరం చేసేలా ఉన్నాయి. అంతేకాకుండా తొలిసారి ఎమ్మెల్యే కావడం, గుంటూరు జిల్లా లో బీసీ నేత కావడం విడదల రజనీకి మైనస్ పాయింట్లు అని చెబుతున్నారు.

# మళ్లీ క్రియాశీలక రాజకీయాల్లోకి డీఎల్

కడప, అక్టోబరు 25, (న్యూస్ పల్స్)కడప జిల్లాకు చెందిన సీనియర్ నేత, మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి మళ్లీ రాజకీయాల్లోకి రీ ఎంట్రీ ఇస్తున్నారు. నాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిపై తిరుగుబాటు జెండా ఎగురవేసి, క్యాబినెట్ నుంచి తవలగించబడిన డీఎల్ ఒకప్పుడు సంచలన రాజకీయనేత. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్ వివేకానందరెడ్డికి మద్దతునిచ్చిన తర్వాత డీఎల్.. సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. ఇటీవలి స్థానిక సంస్థల ఎన్నికల్లో తన అనుచరులకు స్థానిక వైసీపీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సీట్లు ఇవ్వకపోవటంతో, ఆగ్రహించిన డీఎల్ వారిని ఇండిపెండెంట్లుగా నిలబెట్టారు. చివరకు తన సొంత గ్రామంలో కూడా, తాను సిఫార్సు చేసిన వారికి సీట్లు ఇవ్వని వైనం ఆయనకు మనస్తాపానికి గురిచేసింది. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి నిలబెట్టిన అభ్యర్థులపై చాలాచోట్ల డీఎల్ వర్గీయులే గెలవడంతో, ఎమ్మెల్యే వర్గీయులు డీఎల్‌కు వ్యతిరేకంగా ప్రెస్‌మీట్లు నిర్వహించారు. ఈ అంశాలపై సీఎం జగన్‌తో చర్చించేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. ఇదంతా అవమానంగా భావించిన డీఎల్, అప్పటినుంచి పార్టీకి దూరంగానే ఉంటూ వచ్చారు. నిజానికి గత అసెంబ్లీ ఎన్నికల ముందు టీడీపీలో చేరతారన్న ప్రచారం జరిగింది. ఆ మేరకు చంద్రబాబు ఆయనతో భేటీ అయ్యారు. చివరకు నిధుల అంశం కూడా మాట్లాడుకున్నారు. అయితే చివరిలో నాటి టీటీడీ చైర్మన్ సుధాకర్ యాదవ్‌కే టికెట్ ఇవ్వడంతో, టీడీపీలో చేరాలనుకున్న ఆలోచన విరమించుకున్నారు. నాటి నుంచి నేటి వరకూ డీఎల్ పేరు రాజకీయాల్లో ఎక్కడా వినిపించలేదు. అయితే కరోనాకు ముందు మైదుకూరు నియోజకవర్గంలోని తన అనుచరులతో భేటీ నిర్వహించిన ఆయన పాదయాత్రకు సిద్ధమయినట్లు ఆయన అనుచరులు అప్పట్లో చెప్పారు. మండలాలు, గ్రామాల వారీగా కమిటీలు వేసి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాలని నిర్ణయించారు. అయితే కరోనా తీవ్రత వల్ల ఆయన ఆలోచన వాయిదా వేసుకోవలసి వచ్చింది. ఎన్నికల వరకూ ఏ పార్టీలో చేరకుండా, అప్పటివరకూ ప్రజల మధ్యనే ఉంటూ ప్రభుత్వంపై పోరాడాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. మళ్లీ ఇప్పుడు తాను క్రియాశీల రాజకీయాల్లో అడుగుపెట్టబోతున్నానని ఆయనే ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో తప్పకుండా పోటీ చేస్తానని, అయితే ఏ పార్టీ అనేది ఇప్పుడే చెప్పనన్న డీఎల్.. వైసీపీ సర్కారుపై తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. ప్రధానంగా అన్ని శాఖల ప్రెస్‌మీట్లు నిర్వహిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డినుద్దేశించి ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. మంత్రులను డమ్మీలుగా అభివర్ణించిన డీఎల్ ఏమన్నారంటే..2024 ఎన్నికల్లో పోటీ చేస్తా . ఏ పార్టీ తరపున పోటీ చేస్తానన్నది ఇప్పుడే చెప్పలేను. ప్రతిభ ఆధారంగానే పార్టీ టికెట్ వస్తుంది. రాష్ట్రంలో మంత్రులు డమ్మీలుగా మారిపోయారు. రెడ్ల ప్రభుత్వం రావాలని కోరుకున్న వారందరికీ తగిన బుద్ధి వచ్చింది. రాష్ట్రంలో దురదృష్టకరమైన పరిస్థితి నెలకొంది. వ్యవసాయం సంక్షోభంలో పడిపోయింది. రైతును పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దొంగ ఆయిల్ వ్యాపారం చేసే అంబటి కృష్ణారెడ్డికి వ్యవసాయ శాఖలో సలహాదారుడి పదవి. తప్పు చేసిన వాడు తప్పకుండా జైలుకు పోతాడు. పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసే కౌలు రైతు కరువయ్యాడు. నా సొంత పొలాన్ని కౌలుకు ఇద్దామనుకున్నా ఎవరూ ముందుకు రావడం లేదు. సొంత ఖజానా నింపుకోవడమే ధ్యేయంగా పాలకులు పని చేస్తున్నారు. రాష్ట్రంలో ఏ శాఖ మంత్రి ఆ శాఖకు సంబంధించి ప్రెస్ మీట్ పెట్టడం లేదు. దారినపోయే వారందరూ ప్రెస్ మీట్ లు పెడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే ఐదు వందలు, వెయ్యికి ఆశపడి ఎవరు బ్రతక వద్దు. సొంతంగా సంపాదించుకోవడం నేర్చుకోండి. సమాజంలో జరుగుతున్న అక్రమాలపై పాలకులను మీడియా ప్రశ్నించాలి. ప్రశ్నించుకుంటే అధోగతి పాలవుతుంది. భూములు ఆక్రమించుకోవడం ఖజానా నింపుకోవడమే పాలకులు పని. రాష్ట్ర పరిస్థితి, భావితరాల గురించి ఎవరు ఆలోచన చేయడం లేదు. పేదల బియ్యాన్ని 70 శాతం ప్రజలు తినకుండా అమ్ముకుంటున్నారు. సబ్సిడీ ని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ సిస్టం ద్వారా అందించడం ఉత్తమం. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదు కాగా పొలిటికల్ రీఎంట్రీపై డీఎల్‌తో మాట్లాడగా.. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలే తాను మళ్లీ యాక్టివ్ కావలసిన అవసరాన్ని సృష్టించాయని వ్యాఖ్యానించారు. “ఏందయ్యా.. మీరు ఇన్నాళ్ల నుంచీ మమ్మల్ని చూస్తున్నారు. ఎప్పుడైనా అన్ని శాఖల తరఫున ఒకడే మాట్లాడటం మీరెప్పుడైనా చూశారా? ఇప్పుడేందిది? అందరి తరఫున సజ్జల మాట్లాడతాడా? ఆయనకేం తెలుసు? అడిగేవాడు లేడా? మంత్రులు సిగ్గుపడాల్సింది పోయి ఆయన పక్కన కూర్చుంటారా? మొన్న ఉండవల్లి ప్రెస్‌మీట్ చూశా. ఏంది అప్పులు చేయడం మంచిదేనా? ఎవడబ్బసొమ్మని చేస్తారు? ఎవరు తీరుస్తారని చేస్తారు? రాష్ట్రంలో అరాచక పరిస్థితులు చూస్తున్నాం. వాటిని చూస్తూ ఉండలేకపోతున్నా. చాలామంది మీలాంటి వాళ్లు మౌనంగా ఉండటం మంచిదికాదని నన్ను అడుగుతున్నారు. ఈ రాష్ట్రాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. మేధావుల మౌనం సమాజానికి ప్రమాదం. రాష్ట్రాభివృద్ధిపై చిత్తశుద్ధి ఉండి మౌనంగా ఉంటున్న వాళ్లందరూ దయచేసి బయటకొచ్చి గొంతు విప్పాల్సిన సమయం ఇది” అన్నారు. త్వరలో తన భవిష్యత్తు ప్రణాళిక వెల్లడిస్తానని డీఎల్ చెప్పారు.

# కేడర్ లో జోష్..

విజయవాడ, అక్టోబరు 25, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ వ్యూహాలు సక్సెస్ అవుతున్నాయి. స్కెచ్ లు పక్కాగా అమలవుతున్నాయి. ఫలితంగా నిస్తేజంగా ఉన్న నేతలు, క్యాడర్ లో ఉత్తేజం నెలకొంది. గత కొద్ది నెలలుగా తెలుగుదేశం పార్టీలో జరుగుతున్న పరిణామాలకు తెర వెనక సూత్రధారి రాబిన్ శర్మ.. ఈయన వేసిన స్కెచ్ ప్రకారమే పార్టీ అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు నారా లోకేష్ నడుచుకుంటున్నారు. వాటిన అమలు పరుస్తున్నారు. తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల సందర్భంగా టీడీపీకి ఎన్నికల వ్యూహకర్తగా చంద్రబాబు నియమించుకున్నారు. హైదరాబాద్ లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో రాబిన్ శర్మకు ప్రత్యేకంగా కార్యాలయాన్ని కేటాయించారు. గత ఆరు నెలలుగా సర్వేల కోసం వివిధ విద్యాసంస్థల నుంచి విద్యార్థులను నియమించుకునే పనిలో రాబిన్ శర్మ ఉన్నారు. ఆయన హైదరాబాద్ నుంచే ఏపీలో ఏ ఏ అంశాలపై పార్టీ ఆందోళనలు చేయాలన్నది నిర్ణయిస్తున్నారు. ప్రజల్లోకి పాజిటివ్ లో వెళితే తొందరగా వెళ్లలేం. అదే నెగిటివ్ అయితే త్వరగా వెళ్లే అవకాశముంది. రాబిన్ శర్మ అదే నెగిటివ్ పద్ధతిలో వెళ్లాలని నిర్ణయించుకున్నారు. డ్రగ్స్ వ్యవహారాన్ని, గంజాయి అక్రమ రవాణాతో ప్రజల్లోకి వెళ్లాలన్నది రాబిన్ శర్మ ప్లాన్. పట్టాభి ఆ పదం ఉపయోగించడానికి కూడా రాబిన్ శర్మ కారణమంటున్నారు. ఆయన చెప్పినట్లే పట్టాభి ప్రకటన చేయడంతో వైసీపీని రెచ్చగొట్టినట్లయింది. దీంతో పాటు వైసీపీని రెచ్చగొట్టి దాడులు జరిగితే దాని నుంచి సానుభూతిని పొందే ప్రయత్నమూ రాబిన్ శర్మ ఆలోచనల నుంచి వచ్చిందేనని అంటున్నారు. రాష్ట్ర టీడీపీ కార్యాలయాలపై జరిగిన దాడులపై వెంటనే గవర్నర్ తో పాటు ప్రధాని, అమిత్ షా, రాష్ట్రపతికి లేఖలు రాయడం, బాబు 36 గంటల దీక్ష, ఢిల్లీ టూర్ వంటివి కూడా రాబిన్ శర్మ రచించినవే. సో? తెలుగుదేశం పార్టీలో రాబిన్ శర్మ ఇప్పుడు కీలకంగా మారారు. టీడీపీ సోషల్ మీడియా కూడా ఇటీవల కాలంలో యాక్టివ్ అయింది. రాబిన్ శర్మ నేతృత్వంలోని టీం సోషల్ మీడియా వ్యవహారాలను చూస్తున్నట్లు చెబుతున్నారు. ప్రశాంత్ కిషోర్ టీంలో ఉన్న రాబిన్ శర్మ ఆలోచనలనే చంద్రబాబు అమలు చేస్తున్నారు. రానున్న కాలంలో రాబిన్ మరెన్ని స్కెచ్ లు వేస్తారన్నది చూడాలి వ్యూహాత్మక తప్పిదాలే తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో నిన్న మొన్నటి వరకూ కీలక భూమిక పోషించింది. అయితే వరస వ్యూహాత్మక తప్పిదాలతో అది చేటును కోరి తెచ్చుకున్నట్లవుతుంది. నలభై ఏళ్ల రాజకీయం అనుభవం ఉన్న చంద్రబాబు ఆవేశంతో తీసుకుంటున్న నిర్ణయాలు పార్టీకి మరింత అపఖ్యాతిని తెస్తున్నాయి. ఇప్పుడు దీక్షలతో సానుభూతి తెచ్చుకుందామనుకున్న చంద్రబాబుకు రిజల్ట్ జీరోగా మారిందన్న కామెంట్స్ వినపడుతున్నాయిఆంధ్రప్రదేశ్ లో జరుగుతున్న పరిణామాలు ప్రజలకు ఏమాత్రం సంబంధం లేనివి. ఇవి వైపీపీ, టీడీపీ? ల మధ్య వార్ గానే ప్రజలు చూస్తున్నారు. అదే సమయంలో రెండు కులాల మధ్య జరిగిన ఘర్షణగానే జనం భావిస్తున్నారు. గత కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలు ప్రజలకు నేరుగా సంబంధం లేకపోవడంతో టీడీపీకి పెద్దగా మైలేజీ రాలేదు. దూకుడు ప్రదర్శించాల్సిన టీడీపీ ఆత్మరక్షణలో పడిపోయింది. అదే సమయంలో ఆత్మరక్షణలో పడాల్సిన ప్రభుత్వం ఎదురుదాడికి దిగింది. పట్టాభి విషయంలో చంద్రబాబు పెద్ద తప్పిదం చేశారని టీడీపీ నేతలే చర్చించుకుంటున్నారు. పట్టాభి ముఖ్యమంత్రి జగన్ ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలకు ప్రజల మద్దతు లభించదు. ఆ విషయం తెలిసినా చంద్రబాబు వ్యూహాత్మకంగా దీక్షను ఎంచుకున్నారు. పట్టాభి తిట్లకు, ప్రజాసమస్యలకు సంబంధం లేదు. అయినా చంద్రబాబు ఇదేదో రాష?ట్ర సమస్య లాగా తన నెత్తికెత్తుకుని 36 గంటలు సెంట్రల్ ఆఫీస్ లో సీన్ క్రియేట్ చేశారు. రెండున్నరేళ్లుగా టీడీపీ పరిస్థితి బాగాలేదు. పార్టీ నేతలు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు తొలుత పార్టీని చక్కదిద్దుకోవాలి. నియోజకవర్గాలన్నింటికీ ఇన్ ఛార్జులను నియమించాలి. ఆ తర్వాతే ప్రభుత్వంపై పోరాడాలి. అలా కాకుండా చంద్రబాబు ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉన్నా పట్టాభి విషయంలో రాంగ్ ట్రాక్ పట్టి పార్టీని కూడా నవ్వులపాలు చేశారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. చంద్రబాబు ఇప్పుడు ఢిల్లీ పర్యటన పెట్టుకోవడం కూడా వ్యూహాత్మక తప్పిదమే. హస్తిన లో కూడా నవ్వుల పాలయితే ఇక పార్టీ మరింత క్షీణించక మానదు. అందుకే నిమ్మరసం ఇచ్చినా పార్టీకీ ఉత్తేజం కలిగించకపోగా మరింత నీరసం మిగిల్చారు చంద్రబాబు

# గంజాయి నయా ట్రెండ్

విశాఖపట్టణం, అక్టోబరు 25, (న్యూస్ పల్స్)తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు గంజాయి గమ్మత్తుగా చిత్తు చేస్తోంది. రాజకీయాల్లో మాటల మంటలకు అదే కారణం అని చెప్పకతప్పదు. గుజరాత్‌లో దొరికిన మత్తు పదార్థాల దగ్గర్నించి.. నిత్యం విశాఖ, ఏవోబీలో పట్టుబడే గంజాయి వరకూ అంతా రాజకీయ నేతల మధ్య వాగ్వాదానికి కారణం అవుతోంది. ఇదంతా ఒక ఎత్తయితే.. గంజాయిని సాగుచేసే రైతులు అనుసరిస్తున్న విధానాలు ఔరా అనిపించకమానవు. ఇటీవల కాలంలో గంజాయి రవాణాపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో వ్యాపారులు కొత్త విధానాలు అవలంభిస్తున్నారు? ఇంతవరకు వ్యాపారస్తులే నేరుగా ఏజెన్సీకి వచ్చి కొనుగోలు చేసేవారు. ఈ క్రమంలో దాడులు జరిగితే నేరుగా వారిపై కేసులు నమోదవుతున్నాయి. వీటి నుంచి తప్పించుకునేందుకు వ్యాపారులు కొత్త విధానాలను తెరపైకి తెచ్చారు. ప్రస్తుతం గంజాయిని సాగుచేసే రైతులే నేరుగా వ్యాపారులు చెప్పిన చోటుకు అప్పజెప్పేవిధంగా ఒప్పందం చేసుకుంటున్నారు.

# టీడీపీ ఓటు ఎటు వైపు

కడప, అక్టోబరు 25, (న్యూస్ పల్స్)బద్వేలు ఉప ఎన్నికకు ఇంకా వారం రోజులు సమయం ఉంది. ఈలోపు బద్వేలు టీడీపీ నేతలు ఎటువైపు మొగ్గు చూపుతారన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. అసలు పోటీ చేయకపోవడమే పెద్ద తప్పిదంగా స్థానిక టీడీపీ నేతలు భావిస్తున్నారు. మరో ఓటమిని ఖాతాలో వేసుకోలేక, ఖర్చును భరించలేకనే చంద్రబాబు ఎన్నికల నుంచి తప్పుకున్నారని తమ్ముళ్లు భావిస్తున్నారు. లేదంటే కనీసం పార్టీ జెండా ఎగిరేదని, ఈ నిర్ణయంతో కనీసం పదిహేను నుంచి ఇరవై శాతం ఓట్లు దూరమవుతాయని కూడా టీడీపీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరు చెప్పమన్నారు పోటీ చేస్తామని. ముందుగా రాజశేఖర్ ను అభ్యర్థిగా ప్రకటించడంతో పార్టీ నేతలు ఏర్పాట్లు చేసుకున్నారు. రాజశేఖర్ మాత్రం తాను పైసా ఖర్చు పెట్టలేనని, పార్టీ భరిస్తే పోటీ చేయడానికి సిద్ధమని తెలిపారు. కనీసం నాలుగైదు కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. తిరుపతి ఉప ఎన్నికలకే దాదాపు ముప్ఫయికోట్ల రూపాయలకు పైగానే టీడీపీ ఖర్చు చేయాల్సి వచ్చింది. సీనియర్ నేతలు కూడా నిధుల కోసం చేతులు చాచడం కన్పించింది. దీంతో పాటు పవన్ కల్యాణ్ జనసేన పోటీ చేయడం లేదని ప్రకటించారు. దీంతో ఏకగ్రీవమవుతుందని చంద్రబాబు భావించారు. కానీ బీజేపీ, జనసేన బరిలో ఉండటంతో బద్వేలులో ఇప్పుడు ఎన్నికల వాతావరణం నెలకొంది. నియోజకవర్గం అంతటా వైసీపీ జెండాలు ఎగురుతున్నాయి. బీజేపీ, జనసేన కాంగ్రెస్ పార్టీ జెండాలు కూడా కన్పిస్తున్నాయి. కానీ ఎటొచ్చీ టీడీపీ జెండాలే అస్సలు కన్పించకుండా పోయాయి. పార్టీ స్థానిక నేతలు దీనిని తప్పుపడుతున్నారు. ఇప్పుడు టీడీపీ అటు నేరుగా బీజేపీ?కి మద్దతివ్వలేదు. కాంగ్రెస్ కు లోపాయికారిగా సహకరించలేదు. ఒకసారి ఓట?లు టర్న్ అయ్యాయంటే తిరిగి తెచ్చుకోవడం కష్టమే. అందుకే నియోజకవర్గ మంతా పండగ వాతావరణం ఉన్నా టీడీపీ నేతల మొహాల్లో నవ్వులు లేవు. చంద్రబాబు ఎన్నికల నుంచి తప్పుకుని పొరపాటు చేశారంటున్నారు. టీడీపీ ఓటు బ్యాంకు ఇప్పుడు బీజేపీ, కాంగ్రెస్ చీల్చుకుంటే పరవాలేదు. వైసీపీకి మళ్ల కూడదనే లోకల్ టీడీపీ లీడర్లు వేయి దేవుళ్లకు ప్రార్థనలు చేస్తున్నారు.

# సంక్షోభంలో చెరుకు రైతులు



విజయవాడ, అక్టోబరు 25, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ చెరకు సాగుచేసే రైతాంగం సంక్షోభంలో కూరుకుపోయారు. ఏడాదికోసారి చేతికొచ్చే పంట చెరకు. ఏడాదంతా కష్టపడి పండించి, మిల్లులకు సొంత ఖర్చులతో చెరకును చేరవేసిన రైతుకు రెండేళ్లుగా ఫ్యాక్టరీల యాజమాన్యాలు డబ్బులివ్వకుండా వేధిస్తున్నాయి. విజయనగరం, విశాఖపట్నం, చిత్తూరు జిల్లాల్లోని రైతులకు రూ.200 కోట్లు అందాల్సి ఉంది. ఇటువంటి ఘటనలను పరిష్కరించేందుకు షుగర్‌కేన్ కంట్రోల్ చట్టం-1956 ఉన్నా... తమకు ఏమీ సంబంధం లేదనేలా ప్రభుత్వం వ్యవహరిస్తుండటం రైతులను మరింత నష్టాల్లోకి, అప్పుల ఊబిలోకి దింపుతోంది. 2006-07 నాటికి ఎపిలో 29 చక్కెర ఫ్యాక్టరీలు పనిచేస్తే, వాటి సంఖ్య ప్రస్తుతం 6కు పడిపోయింది. దేశవ్యాప్తంగా చెరకు విస్తీర్ణం ఈ ఏడాది పెరిగిందని, ఎపిలో మాత్రం గణనీయంగా పడిపోయిందని విశ్లేషకులు చెబుతున్నారు. దీనికి గల కారణాలను ప్రభుత్వమే విశ్లేషించుకోవాల్సి ఉంది. ఇతర రాష్ట్రాలన్నీ ఏటా చక్కెర పాలసీని ప్రకటించడంతోపాటు కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు రాష్ట్ర ప్రభుత్వాలు అదనంగా కొంత మద్దతు ధరను ఇస్తూ రైతులకు అండగా నిలబడుతున్నాయి. ఎపిలో కేంద్రం ఇచ్చే మద్దతు ధరనే ఇవ్వాల్సి ఉండడంతో రైతులకు కేంద్రం ఇచ్చే గిట్టుబాటు ధర సరిపోక ఈ పంటను వదిలి, వేరే పంటలను సాగుచేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం టన్నుకు రూ.2,750 మాత్రమే మద్దతు ధర ఇస్తోంది. రైతుకు మాత్రం దీనిని మించి ఖర్చులవుతున్నాయి. పెరుగుతున్న నిత్యావసరాలు, ఇంధనం ధరలకు అనుగుణంగా కేంద్రం మద్దతు ధరలు పెంచకపోవడం రైతులకు నష్టం కలగడానికి ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు కేంద్రం మద్దతు ధర నిర్ణయిస్తే రైతులకు గిట్టుబాటవుతుంది. కేంద్రం దానిపై దృష్టి పెట్టడం లేదు. కేరళ, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక వంటి రాష్ట్రాలు చెరకు రైతులను ఆదుకునేందుకు చెరకు పంట తీయడం, ఫ్యాక్టరీలకు తరలించడానికి అవసరమయ్యే ఖర్చులన్నీ భరిస్తూ, రైతులకు మద్దతు ధర ఇస్తూ ప్రోత్సహిస్తున్నాయి.2020-21 చెరకు సీజన్‌లో ఎపిలో లక్ష ఎకరాల్లో చెరకు పంట సాగైతే, 2021-22 సీజన్‌కు 40 వేల ఎకరాల్లోనే చెరకు పంట సాగైంది. చెరకు ఫ్యాక్టరీ ఏడాదిలో 150 రోజులు పనిచేయాలి, దానికి కావాల్సినంత చెరకు ఉండాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ ఫ్యాక్టరీ పనిచేయాలన్నా వాటికి కేవలం 40-50 రోజులు పనిచేసేందుకే చెరకు సాగైంది. దీంతో ప్రస్తుతమున్న చెరకు ఫ్యాక్టరీలు, వాటిలో పనిచేసే కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో వేలాది కార్మిక కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. తమకు రావాల్సిన బకాయిలను తక్షణమే ఇప్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎవరికి వారు తగ్గేదెలా అంటున్న నేతలు

గుంటూరు, అక్టోబరు 25, (న్యూస్ పల్స్)వైసీపీ అధికారంలోకి వచ్చి దాదాపు రెండున్నరేళ్లు కావస్తోంది. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక సంక్షేమమే ప్రధాన ఎజెండాగా ముందుకు సాగుతున్నారు. కరోనా ఎంట్రీతో ఏపీ ఆర్థిక వ్యవస్థ కుదేలైనప్పటికీ ఏపీలో సంక్షేమ పథకాలు ఏమాత్రం ఆగలేదంటే ఆ క్రెడిట్ మొత్తం సీఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుంది. దేశంలోనే అత్యధిక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న రాష్ట్రంగా ఏపీ రికార్డులకెక్కింది. ఇలాంటివి జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు సంయమనం కోల్పోయి వైసీపీపై బూతులు మాట్లాడుతూ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాయి.కొద్దిరోజులుగా ఏపీలో రాజకీయాలు బూతుమాటలు లేకుండా సాగడం లేదంటే అతిశయోక్తి కాదమో. టీడీపీ నేతలు పదేపదే వైసీపీ నేతలను రెచ్చగొడుతుండటంతో అధికార పార్టీ స్థాయి అదే రేంజులో కౌంటర్ ఇస్తోంది. ఇటీవల టీడీపీ నేత పట్టాబి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపాయి. ఈక్రమంలో వైసీపీ అభిమానులు పట్టాభి ఇంటిపై దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. అదేవిధంగా టీడీపీ కేంద్ర కార్యాలయంపై సైతం దాడికి పాల్పడటం అగ్నికి అజ్యం పోసింది.ఈ పరిణామాల నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుదు రంగంలోకి దిగారు. వైసీపీ దాడికి ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్త బంద్ కు పిలుపునిచ్చారు. దీంతో నిన్నంతా ఏపీలో అరెస్టులు, కేసులు, మాటలదాడులతో యుద్ధవాతావరణాన్ని తలపించింది. ఇక దీనికి మూలకారణమైన పట్టాబిని నిన్న రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. ఇదే సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నిరసన దీక్షకు పిలుపునిచ్చారు. అయితే వైసీపీ కూడా కౌంటర్ దీక్షలకు పూనుకోవడం చర్చనీయాంశంగా మారింది.వైసీపీ అధికారంలోకి వచ్చాక టీడీపీ క్రమంగా బలహీనమవుతోంది. వైసీపీకి 151 ఎమ్మెల్యేల మద్దతు ఉండగా టీడీపీకి కేవలం 23మంది ఎమ్మెల్యే మద్దతు మాత్రమే ఉంది. జగన్ అధికారంలోకి వచ్చాక టీడీపీకి చెందిన చాలామంది ఎమ్మెల్యేలు జగన్మోహన్ రెడ్డికి జై కొట్టారు. అదేవిధంగా ఏపీలో ఎలాంటి ఎన్నిక జరిగిన వైసీపీనే ఏకపక్ష విజయాలు సాధిస్తూ వెళుతుంది. ఈ పరిణామాలన్నీ టీడీపీ జీర్ణించుకోలేక టీడీపీ వైసీపీ నేతలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుందని ఆపార్టీ నేతలు భావిస్తున్నారు.టీడీపీ నేతల మాటల దాడికి గట్టిగా తిప్పికొట్టాలని వైఎస్ జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. ఈమేరకు మంత్రులకు, ఎమ్మెల్యేలకు సంకేతాలిచ్చినట్లు తెలుస్తోంది. ఈక్రమంలోనే టీడీపీ, వైసీపీ మధ్య ఓ రేంజులో మాటలయుద్ధం నడుస్తోంది. అయితే ఇది క్రమంగా అదుపుతప్పి దాడుల వరకు వెళ్లడం శోచనీయంగా మారింది. అయితే ఈ దాడికి తమకేమీ సంబంధం లేదని సీఎం జగన్మోహన్ రెడ్డి చెబుతున్నారు. వైసీపీ సానుభూతి పరులు ఈ దాడికి పాల్పడ్డారని వారిపై కేసులు నమోదు చేస్తామని చెప్పుకొచ్చారు. అదే సమయంలో టీడీపీ నేతల వైఖరిని ఆయన తప్పుబట్టారు. ప్రస్తుతం ఏపీలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఎవరికీ వారు తగ్గేదెలా అన్నట్లుగా వ్యవహరిస్తున్నట్లు కన్పిస్తోంది. దీంతో మున్ముందు ఏపీ రాజకీయాలు ఎలా మారుతాయనే సస్పెన్స్ నెలకొంది.

# పోలవరం కోతలు ఇబ్బందులు తప్పవా

విజయవాడ, అక్టోబరు 25, (న్యూస్ పల్స్)ఆంధ్రుల పాలిట వరం పోలవరం విషయంలో కేంద్రం వైఖరి రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది. ఇప్పటికే ఇచ్చిన నిధుల్లోనూ కేంద్రం కోత పెడుతుండడం అసహనం పెంచుతోంది. విద్యుత్కేంద్రం తవ్వకం పనులకు గతంలో ఇచ్చిన రూ.168 కోట్లు మినహాయించుకుంటామని కేంద్రం తెలిపిందని తెలుస్తోంది. పోలవరం దగ్గర 960 మెగావాట్ల విద్యుత్కేంద్రం పనులు చురుకుగా సాగుతున్నాయి.దీని నిర్మాణానికి రూ.4,560.91 కోట్లను డీపీఆర్ నుంచి ఇప్పటికే మినహాయించినట్లు కేంద్రం పేర్కొంది. విద్యుత్కేంద్రం నిర్మాణ వ్యయాన్ని రాష్ట్రం అడగడం లేదు. విద్యుత్కేంద్రానికి నీటిని మళ్లించేందుకు? మట్టి తవ్వకం పనులు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ పనులకు పెడుతున్న ఖర్చుని తమకు ఇవ్వాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరుతోంది. ఈ విషయంలోనూ కేంద్రం నుంచి ఎలాంటి సానుకూల ఫలితాలు రావడం లేదని తెలుస్తోంది.ఈ మట్టి తవ్వకానికి గతంలోనే ఇచ్చిన రూ.168 కోట్లు మినహాయించుకుంటామని కేంద్రం చెబుతుండడంతో ఏం చేయాలో తోచక అల్లాడుతోంది జగన్ ప్రభుత్వం. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాక ఇచ్చిన ప్రతి పైసాపై కేంద్రం పరిశీలన జరుపుతోంది. 2014 ఏప్రిల్ ఒకటి నాటికి ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా సాగునీటి విభాగం కింద రూ.20,398.61 కోట్లు ఖర్చవుతుందని లెక్కలేశారు.గతంలో ఆర్థికశాఖ వేసిన లెక్కల ప్రకారమే ప్రతి పైసా ఆచితూచి విడుదల చేస్తోంది. అంతకుమించి ఒక్క పైసా ఇచ్చేందుకు ఒప్పుకోవడం లేదు. ఏ పనులకు డబ్బులు అడిగినా అవి డీపీఆర్ పరిధిలోకి వస్తాయా రావా అన్న విషయాన్నీ కేంద్రం లోతుగా పరిశీలించాకే నిధులు విడుదల చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది.పోలవరం ప్రాజెక్టులో తాగునీటి విభాగం కింద కోత పెట్టిన రూ.4,068.43 కోట్లు ఎందుకు ఇవ్వాలో తెలిపేలా కేంద్రానికి రాష్ట్ర జలవనరుల శాఖ లేఖ రాయబోతోంది. ఈ నిధులు ఇచ్చేందుకు కేంద్ర జలవనరుల శాఖ సిఫారసు చేసినా ఆర్థికశాఖలోని వ్యయ విభాగం తిరస్కరించింది. దీంతో జలవనరుల శాఖ అధికారులు ఆయా వివరాలు అందించి, తమ వాదన వినిపించేందుకు రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది.పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే ప్రతిపైసా కేంద్రం ఇవ్వాలని ఏపీ పునర్విభజన చట్టం చెబుతోంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం కావడంతో అంచనాలు మించిపోతున్నాయి. ఈ ప్రాజెక్టుకు రూ.47,725.74 కోట్లు ఖర్చవుతుందని తేల్చారు. దీనికి కేంద్ర కేబినెట్ ఆమోదించి నిధులు ఇవ్వాలి. ఏ కారణం చెప్పి ఎంత కోత పెట్టాలా అనేదానిపై కసరత్తు జరుగుతోందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.విద్యుత్కేంద్రం మట్టి తవ్వకానికి సంబంధించి తాజాగా సమర్పించిన రూ.208 కోట్ల బిల్లులూ తిరస్కరణకు గురైనట్లు అధికారులు చెబుతున్నారు. గతంలో బుడమేర మళ్లింపు, తదితర పనులకు ఇచ్చిన నిధులు కోత పెట్టుకుంటామంటూ కేంద్రం మెలిక పెడుతోంది. పోలవరం విద్యుత్కేంద్ర నిర్మాణానికి రూ.3,529.33 కోట్లే ఖర్చవుతాయని డీపీఆర్ లెక్కలు పేర్కొంటున్నాయి. విద్యుత్కేంద్రం ఖర్చురూపంలో రూ.4,560.91 కోట్లు మినహాయించినట్లు కేంద్రం పేర్కొంది. ఆ తేడా రూ.1,031.58 కోట్లు ఇవ్వాలని రాష్ట్రం కోరుతోంది. 2020 అక్టోబరు నుంచి పోలవరం నిధులపై కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య భిన్నాభిప్రాయాలు ఏర్పడ్డ సంగతి తెలిసిందే. వివాదాలు పరిష్కారం కాక.. నిధులు విడుదల కాక ప్రాజెక్టు పనుల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంది.

# కమలం గూటి నుండి తిరిగి సైకిల్ ఎక్కనున్న తెలుగు తమ్ముళ్ళు!




విజయవాడ అక్టోబర్ 25 కమలం గూటి నుండి తిరిగి మళ్లీ సైకిల్ ఎక్కేందుకు సిద్ధవుతున్నారు తెలుగు తమ్ముళ్ళు. దీనికి తోడు మరో రెండున్నరేళ్ల కాలంలో సార్వత్రిక ఎన్నికలు ఉండటం.. ఇటీవల కాలంలో ముందస్తుకు జగన్ వెళతారన్న మాట బలంగా వినిపిస్తోంది. ఇలాంటి వేళలో తాము ముందే మేల్కొని సైకిల్ ఎక్కేయాలనన ఆలోచనలో వారు ఉంటే.. బాబు ఆలోచన మరోలా ఉందట.ఇప్పటికే పార్టీకి చెందిన పలువురు వేర్వేరు పార్టీల్లో చేరిపోయిన వేళ.. తిరిగి వస్తామన్న పార్టీ నేతలకు అడ్డంకి కలుగకుండా బాబు జాగ్రత్తలు తీసుకుంటున్నారంటున్నారు.సీనియర్లు పార్టీలోకి తిగిర వస్తే.. పార్టీ మరింత బలోపేతం అ?తుందన్నది బాబు ఆలోచనగా చెబుతున్నారు.బెల్లం చుట్టూనే ఈగలు తిరుగుతూ ఉంటాయి. రాజకీయ నేతల్ని చూసినంతనే.. బెల్లం.. ఈగల ఉదంతం గుర్తుకు రావటం ఖాయం. ఎక్కడో ఒకట్రెండు చోట్లతప్పించి.. మిగిలిన వారి దారి ఒకేలా ఉంటుందన్న మాట వినిపిస్తోంది. గతంలో మాదిరి పార్టీలు.. సిద్ధాంతాలు.. కమిట్ మెంట్లు.. విలువలతో కూడిన రాజకీయన్ని పదర్శించటం మానేసి చాలా కాలమే అయిపోయింది. ఇప్పుడంతా ఎప్పటికప్పుడు సెటిల్ చేసుకోవటం.. ఏ రోజు ప్రయోజనం అదే రోజుకు.. లేదంటే మరో రోజుకే తప్పించి.. మరే మాటకు అవకాశం లేకుండా పరిస్థితులు చోటు చేసుకుంటున్నట్లుగా చెబుతున్నారు.అదే సమయంలో.. పార్టీ అధినేతలు సైతం ఇలాంటి వారి ఎత్తులకు చిత్తు అవుతూ.. వారిని ఏదోలా తమ పార్టీలోకి చేర్చుకోవటం ద్వారా రాజకీయ బలాన్ని పెంచుకోవాలని భావిస్తున్నారు.2014లో జరిగిన ఎన్నికల్లో మంచి మెజార్టీ సాధించిన తెలుగుదేశం ప్రభుత్వంలో కీలకభూమిక పోషించిన నేతలు.. 2019 ఎన్నికల్లో పార్టీ దారుణమైన ఓటమిని ఎదుర్కొన్న తర్వాత బీజేపీలోకి గుండు గుత్తుగా బీజేపీ తీర్థం తీసుకోవటం తెలిసిందే. దీంతో టీడీపీ కార్యవర్గమంతా తిట్టే పరిస్థితి.కాలక్రమంలో రెండున్నరేళ్లు ముగిసిపోవటం.. అధికార పార్టీ మీద వ్యతిరేకత మొదలైందని.. ప్రజల్లోనూ ఆగ్రహం అంతకంతకూ పెరిగిపోతున్న వైనాన్ని గుర్తు చేసుకున్న వారంతా పార్టీ పిరాఎమ్ములకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది.. రాజ్యసభ సభ్యులుగా ఎంపికైన సుజనా.. సీఎం రమేశ్.. టీజీ వెంకటేశ్.. గరికపాటి మోహన్ రావు లాంటి వారు బీజేపీలో చేరారు. తమకు తోచినట్లుగా.. తమ రాజకీయ ప్రయోజనాల్ని మాత్రమే చూసుకునే వారు.. తప్పించి పార్టీ గురించి ఆలోచించలేదని.. ఇప్పటికైనా బాబు కళ్లు తెరిస్తే మంచిదంటున్నారు. చంద్రబాబు ఏం చేస్తారో వేచి చూడాలి మరి .

## మున్సిపల్ కార్మికుల మెరుపు సమ్మె

నందిగామ అక్టోబరు 25, (న్యూస్ పల్స్) కృష్ణాజిల్లా నందిగామలో మున్సిపల్ కార్మికులు విధులు బహిష్కరించారు. మూడు నెలల నుంచి కౌన్సిల్ సమావేశం జరగపోడంతో పడ్డ కార్మికుల సమస్యలు మరుగునపడ్డాయి. నాలుగు నెలలు దాటినా పెండింగ్ లో కార్మికులు బకాయిలు, వేతనాలు చెల్లించడంలేదు. దాంతో సోమవారం ఉదయం తమ సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్యాలయం ముందు విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు.

## బాంబు పేలుడులో వ్యక్తి మృతి

విశాఖపట్నం అక్టోబరు 25, (న్యూస్ పల్స్)విశాఖపట్నం జిల్లా రావికమతం మండలం మేడివాడ గ్రామంలో బాంబు పేలుడు జరిగింది. ఈ పేలుడు కారణంగా నూక రత్నం అనే వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. దీపావళి సామాగ్రి తయారీ చేస్తుండగా ప్రమాదవశాత్తు పేలడంతో ప్రమాదం జరిగినట్టు అనుమానిస్తున్నారు. అయితే, ఆస్తి తగాదాల కారణంగా తల్లిని హతమార్చినందుకే బాంబు పేలుడు జరిగినట్లు స్థానికుల అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం ధాటికి చుట్టు పక్కల ఇళ్లు కూడా దెబ్బతిన్నాయి. గాయపడిన మహిళను 108లో నర్సీపట్నం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## చంద్రబాబు పై కలెక్టర్ ద్వారా గవర్నర్ కు పిర్యాదు

నెల్లూరు అక్టోబరు 25, (న్యూస్ పల్స్)మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టీడీపీ నేతల దూషణల పర్వం పై ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరు జిల్లా కలెక్టర్ ద్వారా గవర్నర్ కు పిర్యాదు చేసారు. కలువాయి,రాపూరు, సైదాపురం, బాలాయపల్లి మండల నాయకులతో సోమవారం ఉదయం నెల్లూరు జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రదర్ బాబును క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం అయన మీడియా తో మాట్లాడారు. రాష్ట్రముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డిని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వేదికగా అసభ్యకర పదజాలంతో తిట్టడమే కాకుండా రాష్ట్ర ప్రజానీకాన్ని మభ్యపెట్టే విధంగా రాష్ట్ర బంద్ కు పిలుపునిచ్చారని లేఖలో పేర్కొన్నారు. బంద్ విఫలం కావడంతో...36 గంటల దీక్ష అంటూ ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు కపట నాటకాలు వేయడం అప్రజాస్వా మిక,అనైతిక చర్య అని అన్నారు. టిడిపి అధినేత జాతీయ కార్యదర్శి, ఇతర పొలిట్ బ్యూరో సభ్యులు రెచ్చగొట్టే మాటలతో రాష్ట్ర ప్రజలలో అశాంతిని రేకెత్తించి, రాజకీయ లబ్ధి పొందాలని దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వారిపై రాజ్యాంగపరమైన, చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని, ఆంధ్ర రాష్ట్ర ప్రజల మనోభావాలకు విఘాతం కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని వెంకటగిరి నియోజకవర్గ ప్రజల తరపున గవర్నర్ గారికి కలెక్టర్ ద్వారా ఇచ్చిన ఫిర్యాదులో తెలియ జేసినట్లు వెంకటగిరి ఎమ్మెల్యే మీడియాకు తెలిపారు.

## ఎన్నికల పరిశీలకుడిని కలిసిన బీజేపీ నేతలు

కడప అక్టోబరు 25, (న్యూస్ పల్స్) నగరంలోని ఆర్.అండ్.బీ అతిథి గృహంలో కేంద్ర ఎన్నికల పరిశీలకులు భీష్మ కుమార్ ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు సోమవారం కలిసారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్, బీజేపీ రాష్ట్ర ఇన్చార్జి సునీల్ దేవధర్, రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్, జీవీఎల్, మాజీ మంత్రి ఆదినారాయణ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డితదతరులు పాల్గోన్నారు. సోము వీర్రాజు మాట్లాడుతూ స్థానిక పోలీసులతో ఎన్నికలు నిర్వహిస్తే ఏకపక్షంగా జరిగే అవకాశం ఉందంటూ ఫిర్యాదు చేసాం. ఇప్పటికే వైసీపీ నేతలకు తొత్తులుగా వ్యవహరిస్తూ బీజేపీ నేతలను స్థానిక పోలీసులు బెదిరిస్తున్నారు. ఎస్.ఐ స్థాయి నుంచి డీఎస్పీ స్థాయి అధికారుల వరకూ అందరినీ ఉప ఎన్నికల విధుల నుంచి తొలగించాలని కోరాం. వాలెంటీర్ల ద్వారా ఓటర్లను ప్రలోభాలకు, బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి పరిస్థితి పై వివరిఃచాం. స్పందించిన కేంద్ర ఎన్నికల సంఘం 15 ప్లెటూన్ల ప్యారామిలిటరీ బలగాలను పంపారు. స్వేచ్ఛాయుత వాతావరణం లో ఎన్నికలు జరగాలంటే కేంద్ర బలగాలు అవసరం. అధికార పార్టీ మంత్రులు,ఎమ్మెల్యేలుభయానకవాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ఏంజెట్లుగా కూర్చోవడానికి లేకుండా బెదిరిస్తున్నారు. ప్యారా మిలిటరీ బలగాలతో పేరేడ్ నిర్వహించి ఓటర్లలో నమ్మకం కలిగించాలని అన్నారు.అధికార పార్టీ నేతలకు తొత్తులుగా వ్యవహరిస్తున్న పోలీసు అధికారులను విధుల నుంచి తొలగించాలని కోరాం.

# వై.ఎస్.ఆర్.సి.పి, బి.జె.పి ల మధ్య వాడి వేడి విమర్శలు, సవాళ్లు, ప్రతి సవాళ్లు

### ఈనెల 27 న ముగియనున్న ఎన్నికల ప్రచారం

కడప అక్టోబరు 25, (న్యూస్ పల్స్) బద్వేలు ఉప ఎన్నికల ప్రచారం గడువు ఇక మూడు రోజులు మాత్రమే వుంది. దీంతో ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. ఎన్నికల ప్రచార గడువు దగ్గర పడుతుండడంతో వై.ఎస్.ఆర్.సి.పి, భారతీయ జనతాపార్టీ నాయకుల మధ్య వాడి వేడి విమర్శలు, సవాళ్లు, ప్రతి సవాళ్ల మధ్య ప్రచారం సాగుతోంది. వై.ఎస్.ఆర్.సి.పి కార్యకర్తలను, తెదేపా కార్యకర్తలను బి.జె.పిలో చేర్పించేందుకు ఆ పార్టీ నాయకులు కృషి చేస్తున్నారు. ఈ నెల 30వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. ఎన్నికల పోలింగ్ కు సమయానికి 72 గంటలు ముందు ఎన్నికల ప్రచారాన్ని నిలిపి వేయాల్సి వుంటంది. దీంతో ఎన్నికల ప్రచారం గడువు ఈ నెల 27వ తేదీ సాయంత్రం తో ముగియనుంది. వై.ఎస్.ఆర్.సి.పికి చెందిన బద్వేలు(ఎస్సీ) నియోజకవర్గ ఎమ్మెల్యే జి వెంకటసుబ్బయ్య అనారోగ్యంతో ఈ ఏడాది మార్చి 28న మృతి చెందారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఉప ఎన్నికల్లో వై.ఎస్.ఆర్.సి.పి అభ్యర్థిగా దివంగత ఎమ్మెల్యే జి వెంకటసుబ్బయ్య సతీమణి డాక్టర్ దాసరి సుధ పోటీ పడుతున్నారు. దివంగత ఎమ్మెల్యే సతీమణికే పార్టీ టికెట్ కేటాయించడంతో సంప్రదాయంగా పోటీ చేయడం లేదని తెలుగుదేశం, జనసేన పార్టీలు ప్రకటించిన విషయం విధితమే. భారతీయ జనతాపార్టీ తరపున పి సురేష్, కాంగ్రెస్ పార్టీ తరపున మాజీశాసన సభ్యురాలు పి.ఎం కమలమ్మ పోటీ చేస్తున్నారు. ముగ్గరు ప్రధాన పార్టీలతో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థులతో కలుపుకొని మొత్తం 15 మంది ఎన్నికల బరిలో వున్నారు. వై.ఎస్.ఆర్.సి.పి అభ్యర్థి డాక్టర్ దాసరి సుధ విజయానికి రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని నియోజకవర్గ ఇన్ ఛార్జ్ గా నియమించారు. ఈయన ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రులు ఎస్.బి అంజాద్ బాష, నారాయణస్వామి, ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ చీఫ్ విప్ జి శ్రీకాంత్ రెడ్డి, కడప పార్లమెంట్ సభ్యుడు వై.ఎస్ అవినాష్ రెడ్డి, కడప, అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు చెందిన శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, నాయకులు గత కొన్ని రోజులుగా మాకం వేసిఎన్నికల వ్యూహాలను పన్నుతున్నారు. ప్రతి రోజూ నియోజకవర్గంలోని 7 మండలాల్లోని నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వై.ఎస్.ఆర్.సి.పి నాయకులు, భారతీయ జనతాపార్టీ నాయకుల మధ్య వాడి వేడి విమర్శలు, సవాళ్లు, ప్రతి సవాళ్లు మధ్య ఎన్నికల ప్రచారం హోరు ఎత్తుతోంది. ఇప్పటికే భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షులు సోమువీర్రాజు బద్వేలు నియోజకవర్గంలో గత వారం రోజులుగా తిష్ట వేసి ప్రచారం నిర్వహిస్తున్నారు. కేంద్ర మంత్రి కె మురుగన్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన ఛార్జ్ సునీల్ దేవదర్, జనసేన నాయకులతో పాటు మాజీమంత్రి సి ఆదినారాయణరెడ్డి, పార్టీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు సి ఎల్లారెడ్డి, ఎన్ రమేష్ లతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. సోము వీర్రాజు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆయన పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. మరో ప్రక్క కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.ఎం కమలమ్మకు మద్దతుగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సాకే శైలజానాథ్, పార్టీ వర్కింగ్ ప్రెశిడెంట్స్ మస్తాన్ వల్లి, ఎన్ తులసిరెడ్డిలు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. బద్వేలు అసెంబ్లీ ఎన్నికల ఇన్ ఛార్జ్, రాష్ట్ర మంత్రి పి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో భారీ మెజార్టీ సాధించేందుకు వ్యూహం పన్నుతున్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో దివంగత ఎమ్మెల్యే వెంకట సుబ్బయ్య 44 వేల మెజార్టీతో గెలుపొందారు. అప్పట్లో నవరత్నాలు అమలు చేయక పోయినా వెంకట సుబ్బయ్య భారీ మెజార్టీతో గెలుపొందారని, ప్రస్తుతం అధికారంలోకి రావడంతో నవరత్నాలు అమలు చేస్తున్నామని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని పార్టీ నాయకులు పార్టీ యంత్రాగానికి దిశ నిర్దేశం చేస్తున్నారు. దాదాపు లక్ష ఓట్ల మెజార్టీతో గెలుపొంది జగనన్న కానుకగా ఇచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రతి ఒంటికి ఒకటికి నాలుగుసార్లు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీసి, సంక్షేమ పథకాలకు సంబంధించి వివరించి ప్రజలకు ఓట్లు అడగాలని కార్యకర్తలకు పేర్కొంటున్నారు. మరో ప్రక్క బి.జె.పి తీవ్ర విమర్శలు చేస్తున్నారు. రాష్ట్ర విభజన సమస్యలుపరిష్కరించడంలో విఫలమైందని, జిల్లాలో ఉ క్కుకర్మాగారం నిర్మించాలేదని, రాష్ట్ర అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదని ప్రచారం చేస్తున్నారు. బి.జె.పి నాయకులు జిల్లాలో అమలు అవుతున్న అన్ని సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అమలు అవుతున్నాయని, వై.ఎస్.ఆర్.సి.పి నాయకులు వారి పార్టీ స్టిక్కర్లు వేసుకొని ప్రచారం చేసుకొంటున్నారని విమర్శిస్తున్నారు. బద్వేలు అభివృద్ధికి తమ పార్టీ కృషి చేస్తోందని పేర్కొంటున్నారు. సోము వీర్రాజు మాట్లాడుతూ బద్వేలులో ప్రలకు త్రాగునీటి కష్టాలు విపరీతంగా వున్నాయని, నీటి కోసం నిధులు వచ్చాయని, వాటిని వై.ఎస్.ఆర్.సి.పి నాయకులు దారి మళ్లిస్తున్నారని విమర్శించారు. బద్వేలు బస్తీలా లేదని, గుంతల రోడ్లతో ప్రజలు కుస్తీ పడుతున్నారన్నారు. టీడీపీ శ్రేణులను కలిసి వారికి ఉన్నత పదవులు ఇస్తామని, ఎన్నికల్లో సహకరించాలని మంత్రులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఓటర్లను వాలెంటీర్ల ద్వారా భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. బద్వేలు అభివృద్ధి పై మంత్రి పెద్దిరెడ్డి చర్చకు రావాలని సవాల్ విసిరారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లను నియమిస్తామని ప్రకటించారు. మరో ప్రక్క కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.ఎం కమలమ్మకు మద్దతుగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సాకే శైలజానాథ్ బద్వేలులో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

## వార్డుల అభివృద్ధికి కృషి

పెందుర్తి అక్టోబరు 25, (న్యూస్ పల్స్) పెందుర్తి నియోజవర్గం సుజాతనగర్ ,కార్మికనగర్ లో సుమారు 40 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదీప్ రాజ్ శంకుస్థాపన చేసారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన హామీలను 100% నెరవేర్చిన ఏకైక నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. సంక్షేమ పథకాలతో పాటు గత ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం వార్డుల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నానని తెలిపారు. వార్డుల్లో మౌలికవసతుల పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని ఎమ్మెల్యే అదీప్ పేర్కొన్నారు. ఆయనతోపాటు జీవీఎంసీ యంత్రాంగం, వైఎస్ఆర్సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

## సెల్ టవర్ నిర్మాణం ఆపి వేయాలని కాలనీ వాసులు ధర్నా

### - కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్ కు వినతి

కోరుట్ల అక్టోబర్ 25 మెట్ పల్లి పట్టణంలోని 9వ వార్డులోని రామ్ నగర్, సుల్తాన్ పుర మధ్యలో ఒక వ్యక్తి ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ నిర్మాణం నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాలనీ వాసులు పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో పెట్రోలు బంక్ వద్ద జాతీయ రహదారి పై ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాలనీలో సెల్ టవర్ నిర్మాణం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో ఉదుత ఆనంద్ అను వ్యక్తి సెల్ టవర్ నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. కాలనీలో ప్రైవేట్ పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాలలు ఉన్న నేపథ్యంలో చిన్న చిన్న పిల్లలు సైతం ప్రమాదకర రేడియేషన్ బారినపడి అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారని తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికైనా పట్టించుకుని సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపివేయాలని డిమాండ్ చేశారు.

# జర్నలిస్ట్ లపై దాడులను ఖండించాలి

దర్శి అక్టోబరు 25 ( విభారె) ప్రకాశం జిల్లా దర్శి లో సోమవారం జర్నలిస్ట్ లపై దాడులను ఖండిస్తూ దర్శి నియోజకవర్గం లో ఉన్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ లందరూ కలిసి దర్శి తహసీల్దార్ బి. వరకుమార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈనెల 23 వ తేదీ అనగాశనివారం నాడు త్రిపురాంతకం మండల కాకతీయ విలేఖరి పై గుట్కా,మరియు రేషన్ మాఫియా వారు హత్యాయత్నానికి పాల్పడి విఫలయత్నం చేసిన సందర్భంగా వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ దర్శి మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద విలేకరుల సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేసి తాసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విలేకరులు మాట్లాడుతూ సమాజంలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేసే విలేకరులపై దాడి చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అదేవిధంగా విలేకర్ల హక్కులను పరిరక్షించాలని విలేకరులపై దాడులకు తెగబడే వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దర్శి మండల సిపిఐ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ విలేకరుల పై దాడి చేయడం హేయమైన చర్యని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, అలాగే ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు అయినటువంటి విలేకరులపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదని గుట్కా, రేషన్ అక్రమ సంపాదన కొరకు అడ్డదారులు తొక్కుతూ విలేకరులపై దాడులకు తెగబడటం

హేయమైన చర్యని ఇలాంటి దాడులను ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గం లోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న విలేకరులు మరియు సిపిఐ పార్టీ దర్శి మండల కార్యదర్శి ఇ రమేష్ సిపిఐ నాయకులు జూపల్లి కోటేశ్వరరావు ప్రజా సంఘాల నాయకులు జి ప్రేమ్ కుమార్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రొడ్యూసర్ శ్రీనివాస్ స్ఫూర్తి తోనే తీరం చిత్రం గమ్యానికి చేరిక

## డైరెక్టర్ అనిల్ ఇనమడుగు వెల్లడి

నెల్లూరు సింహపురి వాస్తవ్యులు స్నేహశీలి అయినటువంటి ప్రొడ్యూసర్ మండల పార్టీ శ్రీనివాస్ స్ఫూర్తి తోనే తీరం చిత్రం పూర్తి చేయగలిగామని డైరెక్టర్ అనిల్ ఇనమడుగు పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని స్థానిక ఎం జి బి మాల్ లో తీరం చిత్రం యూనిట్ ఆధ్వర్యంలో తీరం చిత్రం ట్రైలర్ ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ అనిల్ ఇనమడుగు మాట్లాడుతూ తీరం చిత్రం ప్రారంభించి ముందుకు తీసుకెళ్తున్న నేపథ్యంలో అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ క్రమంలో చిత్ర నిర్మాణం మార్గమధ్యలోనే ఆగిపోయిన అన్నారు. ఈ తరుణంలో నెల్లూరు జిల్లా, వాకాడు మండలం, కొక్కు పాడు గ్రామానికి చెందిన తన చిన్ననాటి స్నేహితులు ఎల్ ఎస్ ప్రొడక్షన్ అధినేత మర్లపార్టీ శ్రీనివాస్ దృష్టికి తీరం చిత్రం ఆటుపోట్లను తీసుకెళ్లడం జరిగిందన్నారు. తీరని చిత్రాన్ని గమ్యాన్ని చేర్చేందుకు నేనున్నానంటూ, మాకు అండగా నిలబడి తీరం నుండి నావ లాగ మా తీర చిత్ర యూనిట్ భరోసా ఇవ్వడమే కాకుండా, అంతా తానై చిత్రం పూర్తి చేసేందుకు తన వంతు సహకారం అందించారని ఆయన స్నేహభావం గురించి వివరించారు..తీరం చిత్రం యూనిట్ ఐక్యత సహకారం అభినందనీయం. తీరం చిత్రం లో అన్ని విభాగాలలో పనిచేసిన అందరి సహకారం ఐక్యత అభినందనీయమని చిత్రం యూనిట్ సభ్యుల గురించి తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. చిత్రం తొలి నుండి పూర్తయ్యేంతవరకు చిత్రం యూనిట్ లో ప్రతి ఒక్కరూ వారికి అప్పగించిన నటన విధులను నిర్వర్తించడంలో ఆయా పాత్రలకు జీవం పోశారని పేర్కొన్నారు. తీరం చిత్రం లో ముఖ్యంగా మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. ఒక తల్లి గాను, చెల్లి గాను, ప్రేమికురాలు గాను సమాజంలో ఎలా ఉండాలో కంటిని కట్టినట్లు చూపించగలిగే, చూడగలిగే కుటుంబ కథా చిత్రం తీరం అని అన్నారు. ప్రొడ్యూసర్ శ్రీనివాస్ సినీరంగంలో అగ్ర స్థాయికి చేరుకునేందుకు మా వంతు సహకారం అందిస్తామని తీరం చిత్రం యూనిట్ తరపున భరోసా ఇచ్చారు......... ఈనెల 29న తీరం చిత్రం అన్ని ప్రముఖ కేంద్రాలలో ఘనంగా విడుదల ×. ప్రొడ్యూసర్ మర్లపాటి శ్రీనివాస్. కుటుంబ కథా చిత్రం తీరం ఈనెల 29న ప్రముఖ అన్ని కేంద్రాలలో ఘనంగా విడుదల కాబోతుందని, సినీ అభిమానులు, ప్రేక్షకులు తప్పకుండా తీరం సూత్రాన్ని చూసి ఆదరించాలని కోరారు. తీరం చిత్రం ప్రారంభ సమయంలో మిత్రులు డైరెక్టర్ అనిల్ ఇనమడుగు తనను ఆహ్వానించిన ఇప్పటికీ అనివార్య కారణాల వలన కొంత సమయం వేచి ఉండాల్సి వచ్చింది అన్నారు. అయితే తీరం చిత్రనిర్మాణం ఆగిపోయే పరిస్థితి ఎదురయింది అని తెలిసిన తర్వాత చిత్ర యూనిట్ కు తన వంతు సహకారం అందించాలని సంకల్పంతోనే ముందుకు రావడం జరిగిందన్నారు. చిత్ర నిర్మాణ బాధితులు తీసుకున్నప్పటి నుండి ఎన్నో వ్యయ ప్రయాసలకు కోరుకున్న టికీ తన మిత్రులు శ్రేయోభిలాషుల సహకారంతో చిత్రనిర్మాణం పూర్తి చేయగలిగామని పేర్కొన్నారు. సినీ రంగంలోకి ప్రవేశించి తొలి పొడక్షన్ పూర్తి చేసుకొని విజయం వైపు చూస్తున్న సమయంలో తనకు సినీ రంగంలోనే రాణించాలని కోరిక కలిగిందన్నారు. తన ఆధ్వర్యంలో 2వ చిత్రం తీసేందుకు కూడా సన్నాహాలు చేస్తున్నామన్నారు . నాటు తుపాకీ పేరుతో 2వ చిత్రం త్వరలో తెరపైకి తీసుకురానున్నట్లు ప్రొడ్యూసర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హీరో శ్రావణ్ మరియు కథానాయిక అపర్ణ అనివార్య కారణాల వలన రాలేకపోయారని చింతించారు. ఈ ఈ కార్యక్రమానికి యాంకర్ అమూల్య పాల్గొని తీరం చిత్రం గురించి చెప్పడమే కాకుండా ప్రేక్షకులను తన వాక్చాతుర్యంతో ఉర్రూతలూగించారు.

# ఈ సమయంలో కొబ్బరి నీళ్లు తాగడం వల్ల శరీరం జీవక్రియ రెట్టింపు అవుతుంది, చాలా లాభాలు పొందుతారు

కొబ్బరి నీరు ప్రకృతి మనకు ఇచ్చిన అద్భుతమైన పానీయం. ఇది వేడిని ఎదుర్కోవటానికి ఉత్తమమైన పానీయాలలో ఒకటి మరియు శరీరంలో శక్తిని త్వరగా భర్తీ చేయడానికి సహాయపడుతుంది. ఇది సహజమైన ఎంజైమ్‌లు మరియు పొటాషియం వంటి ఖనిజాలను కలిగి ఉన్నందున ప్రతి ఒక్కరూ తాగగల సూపర్ డ్రింక్. రోజులో ఏ సమయంలోనైనా స్వచ్ఛమైన కొబ్బరి నీళ్లు తాగడం మంచిదే అయినప్పటికీ, సమయానికి తాగడం వలన మీరు పొందే ఆరోగ్య ప్రయోజనాలు రెట్టింపు అవుతాయి. మీరు పగలు మరియు రాత్రి రెండింటినీ త్రాగవచ్చు, కానీ కొన్ని సమయాల్లో కొబ్బరి నీళ్లు తాగడం వలన మీ ఆరోగ్యంలో గణనీయమైన మార్పు వస్తుంది. కొబ్బరి నీళ్ల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు మరియు కొబ్బరి నీళ్లు ఏ సమయంలో తాగాలి అనే దాని గురించి తెలుసుకోవడానికి వ్యాసం చదవండి. బరువు తగ్గడానికి సహాయపడుతుంది బరువు తగ్గడానికి సహాయపడుతుంది బరువు తగ్గాలనుకునే ప్రతి ఒక్కరూ కొబ్బరి నీళ్లు తాగవచ్చు. ఇందులో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది జీర్ణక్రియ మరియు కొవ్వు జీవక్రియను పెంచే బయో-యాక్టివ్ ఎంజైమ్‌లను కలిగి ఉంటుంది. రోజుకు కనీసం 3-4 సార్లు కొబ్బరి నీళ్లు తాగడం వల్ల బరువు తగ్గవచ్చు. డయాబెటిస్‌ను ఒక వారంలో నయం చేయవచ్చా? అయితే మీరు తాగాల్సిన జ్యూస్ ఇదే..డయాబెటిస్‌ను ఒక వారంలో నయం చేయవచ్చా? అయితే మీరు తాగాల్సిన జ్యూస్ ఇదే.. శక్తి పానీయం శక్తి పానీయం కొబ్బరి నీరు స్పోర్ట్స్ డ్రింక్స్‌కు సహజ ప్రత్యామ్నాయం. వ్యాయామం చేసే సమయంలో మరియు తర్వాత ఎలక్ట్రోలైట్ బ్యాలెన్స్‌ను పునరుద్ధరించడానికి ఇది అద్భుతమైన పానీయం. మీరు తాజాగా ఉండటానికి ఏదైనా కార్యాచరణకు ముందు మరియు తరువాత కొబ్బరి నీరు త్రాగవచ్చు. పొటాషియం అధికంగా ఉండే కొబ్బరి నీరు ఏ స్పోర్ట్స్ డ్రింక్ కంటే మంచిది. :కొబ్బరి దినోత్సవాన్ని ఎందుకు జరుపుకుంటారో తెలుసా... జీర్ణక్రియను సులభతరం చేస్తుంది జీర్ణక్రియను సులభతరం చేస్తుంది బయోయాక్టివ్ కాంపౌండ్స్ మరియు అధిక ఫైబర్ సాంద్రత కారణంగా, కొబ్బరి నీరు మీ జీర్ణక్రియకు సహాయపడుతుంది మరియు ఆమ్లత్వం ఏర్పడటాన్ని తగ్గిస్తుంది. మీకు ఆమ్లత్వం లేదా మీ కడుపు నిండినట్లయితే, ఒక గ్లాసు కొబ్బరి నీళ్లు తాగడం వల్ల మీకు మంచి అనుభూతి కలుగుతుంది. సాధారణ నోటి సమస్యలు మరియు వాటిని నివారించడానికి మార్గాలు ...సాధారణ నోటి సమస్యలు మరియు వాటిని నివారించడానికి మార్గాలు ... హైడ్రేషన్ పెంచుతుంది హైడ్రేషన్ పెంచుతుంది కొబ్బరి నీరు శరీరానికి అవసరమైన నీటిని నిలుపుకోవడంలో సహాయపడుతుంది. ఈ రిఫ్రెష్ పానీయం కూడా కొద్ది మొత్తంలో తీపిని కలిగి ఉంటుంది. దీని ఎలక్ట్రోలైట్ నిర్మాణం శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడానికి కూడా సహాయపడుతుంది. రక్తపోటును తగ్గించడం రక్తపోటును తగ్గించడం కొబ్బరి నీటిలో విటమిన్ సి, మెగ్నీషియం మరియు పొటాషియం ఉండటం వలన, ఇది రక్తపోటును తగ్గించడంలో అద్భుతమైన పానీయం. ప్రతిరోజూ ఒక గ్లాసు కొబ్బరి నీరు తాగడం వల్ల రక్తపోటును తగ్గించవచ్చు. ఉదయం ఖాళీ కడుపుతో త్రాగాలి ఉదయం ఖాళీ కడుపుతో త్రాగాలి ఉదయం ఖాళీ కడుపుతో కొబ్బరి నీళ్లు తాగడం వల్ల మీ ఆరోగ్యం అనేక విధాలుగా మెరుగుపడుతుంది. కొబ్బరి నీటిలో లారిక్ యాసిడ్ ఉంటుంది, ఇది మీ రోగనిరోధక శక్తిని పెంచడానికి, మీ జీవక్రియను ప్రారంభించడానికి మరియు బరువు తగ్గడానికి సహాయపడుతుంది. గర్భిణీ స్త్రీలు డీహైడ్రేషన్ మరియు మలబద్ధకాన్ని ఎదుర్కోవడానికి కొబ్బరి నీళ్లు తాగాలని ఆరోగ్య నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. ఇది ఉదయం అనారోగ్యం మరియు గుండెల్లో మంట వంటి సాధారణ గర్భధారణ లక్షణాలను నివారించడానికి కూడా సహాయపడుతుంది. వ్యాయామానికి ముందు లేదా తర్వాత వ్యాయామానికి ముందు లేదా తర్వాత కొబ్బరి నీళ్లు ఒక గొప్ప సహజమైన స్పోర్ట్స్ డ్రింక్, ఇది వ్యాయామం చేసేటప్పుడు మీ శరీరాన్ని చల్లగా మరియు శక్తివంతంగా ఉంచడంలో సహాయపడుతుంది. వ్యాయామం తరువాత, కొబ్బరి నీరు శరీరం కోల్పోయిన ఎలక్ట్రోలైట్‌లను తిరిగి నింపడానికి సహాయపడుతుంది. కొబ్బరి నీళ్లు తాగడం వల్ల అలసటతో పోరాడి శక్తిని పెంచుతుంది భోజనానికి ముందు భోజనానికి ముందు భోజనానికి ముందు ఒక గ్లాసు కొబ్బరి నీరు తాగడం వల్ల అతిగా తినడం నివారించబడుతుంది. ఇందులో కేలరీలు తక్కువగా ఉంటాయి. కొబ్బరి నీళ్లు తాగడం వల్ల జీర్ణక్రియ వేగవంతమవుతుంది మరియు భోజనం తర్వాత మంటను నివారిస్తుంది. కొబ్బరి నీళ్లను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మీ శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడుకోవడంలో, మీ రక్తపోటును నియంత్రించడంలో మరియు జీర్ణక్రియ పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. పడుకొనేముందు పడుకొనేముందు కొబ్బరి నీటి తీపి ఆందోళనను తగ్గించడంలో మరియు గుండె వేగాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. ఒత్తిడిని ఎదుర్కోవడానికి మరియు మనస్సును ప్రశాంతంగా ఉంచడానికి పడుకునే ముందు కొంచెం కొబ్బరి నీళ్లు తాగండి. అదనంగా, నిద్రవేళలో కొబ్బరి నీళ్లు తాగడం వల్ల టాక్సిన్స్ బయటకు వెళ్లి మీ మూత్ర నాళాన్ని శుభ్రపరుస్తుంది. తద్వారా మీరు ఇన్ఫెక్షన్లు మరియు కిడ్నీ సంబంధిత సమస్యలను నివారించవచ్చు. మీకు అలసట అనిపించినప్పుడు మీకు అలసట అనిపించినప్పుడు హ్యాంగోవర్ నివారించడానికి ఒక గ్లాసు కొబ్బరి నీరు ఉత్తమ ఇంటి నివారణ. మద్యపానం ఉన్నవారికి డీహైడ్రేషన్ ఒక ప్రధాన సమస్య. ఇది తలనొప్పి మరియు వంటి వాటికి దారితీస్తుంది. కొబ్బరి నీరు దీనికి వ్యతిరేకంగా పోరాడటానికి సహాయపడుతుంది మరియు కోల్పోయిన ఎలక్ట్రోలైట్‌లను పునరుద్ధరిస్తుంది.




# 'వరుడు కావలెను' సంగీత్ లో మెరిసిన పూజ హెగ్డే!



ఇప్పుడు అందరి కళ్లలో నానుతున్న సినిమా 'వరుడు కావాలి' అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే పోస్టర్స్ నుంచి కూడా ఈ సినిమా ఫ్యామిలీ ఆడియన్స్ ను ఎంతగానో ఆకట్టుకుంటోంది. హీరోగా నాగశౌర్య ఇంతకుముందు సినిమాల కంటే ఈ సినిమాలో మరింత హ్యాండ్సమ్ గా కనిపిస్తున్నాడు. అలాగే రీతూ వర్మ కూడా మరింత అందంగా అనిపిస్తోంది. ఈ సినిమా టీజర్ .. ట్రైలర్ చూడగానే కెమెరా పనితనం బాగుందని అనిపించడం ఖాయం. విజువల్స్ అంత అందంగా .. గ్రాండ్ గా ఉన్నాయి. ఇక ఈ సినిమాకి తమన్ .. విశాల్ చంద్రశేఖర్ బాణీలను అందించారు. ఇప్పటికే వదిలిన పాటల్లో 'కోలా కళ్లే ఇలా' .. 'దిగు దిగు దిగు నాగ' జనంలోకి బాగా దూసుకెళ్లాయి. బీట్ పరంగా .. సాహిత్యం పరంగా .. చిత్రీకరణ పరంగా .. కాస్ట్యూమ్స్ పరంగా కూడా ఈ పాటలు ఆకట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమాను ఈ నెల 29వ తేదీన విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేసుకుంటున్నారు .. ప్రమోషన్స్ వేగాన్ని పెంచారు. అందులో భాగంగానే నిన్న రాత్రి 'సంగీత్' పేరుతో హైదరాబాదులో ఈవెంట్ ను నిర్వహించారు. ఈ ఫంక్షన్ కి ముఖ్య అతిథిగా జ హెగ్డేను ఆహ్వానించారు. దాంతో ఈ వేదికపై ఆమె ప్రత్యేకంగా మెరిసింది. సాధారణంగా సినిమా ఫంక్షన్స్ కి హీరోలను చీఫ్ గెస్టులుగా పిలుస్తుంటారు. కానీ పూజ హెగ్డేను పిలవడం కొత్తగా అనిపించింది. సహజంగానే సన్నజాజి మొగ్గలా నాజూకుగా కనిపించే పూజ హెగ్డే ఈ స్టేజ్ పై తళుక్కుమంది. ఆమె హెయిర్ స్టైల్ .. కాస్ట్యూమ్స్ అభిమానుల మనసులను మరోసారి గెలుచుకున్నాయి. ఫంక్షన్ అంతా కూడా నవ్వుతూ కనిపిస్తూ ప్రధానమైన ఆకర్షణగా నిలిచింది. ఎవరినీ .. ఏ విషయాన్ని మరిచిపోకుండా మాట్లాడుతూ సందడి చేసింది. తనని చీఫ్ గెస్టుగా పిలవాలనే ఆలోచన చేయడం నిర్మాతల గొప్పతనమని తేల్చేసింది. దర్శకురాలిగా లక్ష్మీసౌజన్య పడిన కష్టం తెరపై కనిపిస్తూనే ఉందనీ ఆమె కష్టానికి తగిన సక్సెస్ లభిస్తుందనే నమ్మకం తనకి ఉందంటూ ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. ఇక నాగశౌర్య కష్టపడి తనని తాను మల్చుకున్న హీరో అనే విషయాన్ని స్పష్టం చేసింది.

# ఎటూ తేల్చుకోలేక పోతున్న సురేశ్ బాబు!


తెలుగు సినిమా ఇండస్ట్రీలో సురేశ్ బాబుకి ఉన్న పేరు ప్రఖ్యాతులను గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసిన పనిలేదు. అపారమైన అనుభవం ఆయన సొంతం. తన బ్యానర్ కి సంబంధించిన సినిమాల విషయంలో ఆయన చాలా జాగ్రత్తగా ఉంటారు. ఆయన నిర్ణయాలు నియమాల్లా అనిపిస్తాయి. అంతగా ఆయన వాటిని అమలుపరుస్తూ ఉంటారు. కథా చర్చల దగ్గర నుంచి జనంలోకి సినిమా వెళ్లేవరకూ ఆయన కీలకమైన పాత్రను పోషిస్తూ ఉంటారు.



అలాంటి సురేశ్ బాబు 'దృశ్యం 2' .. 'విరాటపర్వం' సినిమాల విడుదలను తేల్చకపోవడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఆ మధ్య తమిళంలో ధనుశ్ చేసిన 'అసురన్' సినిమా అక్కడ సంచలన విజయాన్నిసొంతం చేసుకోవడంతో ఆ సినిమా తెలుగు రీమేక్ హక్కులను తీసుకుని అదే నిర్మాతతో కలిసి సురేశ్ బాబు 'నారప్ప'ను నిర్మించారు. చాలా తక్కువ సమయంలో .. తక్కువ బడ్జెట్ లో ఈ సినిమాను పూర్తి చేయడం .. అసలు ఆ తరహా కథను ఎంచుకోవడం సురేశ్ బాబు ప్లానింగ్ లో భాగమే. ఆ సమయంలో థియేటర్ల పరిస్థితి కాస్త అటు ఇటుగా ఉండటంతో ఈ సినిమాను అమెజాన్ ప్రైమ్ వారికి అప్పగించేశారు. ఈ విషయంలో సురేశ్ బాబు చాలా ఫాస్టుగా నిర్ణయం తీసుకున్నారు. ఇక ఇప్పుడు ఆయన చేతిలో 'దృశ్యం 2' .. 'విరాటపర్వం' సినిమాలు రెడీగా ఉన్నాయి. మలయాళంలో 'దృశ్యం' సీక్వెల్ గా 'దృశ్యం 2' చేసిన జీతూ జోసెఫ్ మరో భారీ హిట్ ను సొంతం చేసుకున్నాడు. ఆయనే తెలుగులో 'దృశ్యం 2' సినిమాకి దర్శకత్వం వహించాడు. సగటు ప్రేక్షకుడికి కనెక్ట్ అయ్యే కథ కావడం వలన ఈ సినిమా కోసం వెంకటేశ్ అభిమానులంతా ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా ఈ సినిమా పట్ల ఫ్యామిలీ ఆడియన్స్ ఆత్రుత కనబరుస్తున్నారు. రానా కథానాయకుడిగా చేసిన 'విరాటపర్వం' కోసం ఎదురుచూసేవారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. రానా నక్సలైట్ గా నటించడం ఒక విశేషమైతే ఆయనను ప్రేమించే గ్రామీణ యువతిగా సాయిపల్లవి నటించడం మరో విశేషంఈ సినిమా నుంచి వచ్చిన ప్రచార చిత్రాలు ఒక రేంజ్ లో అంచనాలు పెంచాయి. అయితే ఈ రెండు కూడా ఓటీటీకి వెళతాయా? థియేటర్లకు వస్తాయా? అనే విషయంలో ఇంతవరకూ క్లారిటీ రాలేదు. వీటి విడుదల విషయాన్ని సురేశ్ బాబు ఇంతవరకూ తేల్చలేదు. థియేటర్ల పరిస్థితి ఎలా ఉంటుందో తెలియని పరిస్థితుల్లో ఆయన ఈ సినిమాలను ఓటీటీ ద్వారా రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ ఇటీవల వచ్చిన 'లవ్ స్టోరీ' .. 'బ్యాచ్ లర్' భారీ వసూళ్లను రాబట్టడంతో మళ్లీ ఆయన ఈ వైపు మొగ్గు చూపుతున్నారని టాక్. మిగతా సినిమాలన్నీ కూడా కేలండర్లో ఏ డేట్ దగ్గర ఖాళీ దొరికితే అక్కడ కర్చీఫ్ వేసేసి సర్దుకున్నాయి. ఎక్కడా ఖాళీ లేకపోవడంతో సురేశ్ బాబు ఆలోచనలో పడటమే ఈ ఆలస్యానికి కారణమనే టాక్ కూడా వినిపిస్తోంది.

# హీరోయిన్ తో రొమాన్స్ ను మొదలెట్టేసిన 'హీరో'

సూపర్ స్టార్ కృష్ణ ఫ్యామిలీ నుంచి మరో హీరో రానున్నాడు. అందుకు సంబంధించిన రంగం పూర్తయింది. మహేశ్ బాబు మేనల్లుడు గల్లా అశోక్ హీరోగా ఎంట్రీ ఇవ్వడానికి చాలా కాలంగా మంచి ఉత్సాహాన్ని చూపుతున్నాడు. సొంత బ్యానర్ ను ఏర్పాటు చేసుకుని 'హీరో' సినిమాతో రంగంలోకి




దిగిపోయాడు. ఈ సినిమాకి సంబంధించిన షూటింగు చాలా రోజుల క్రితమే మొదలైనప్పటికీ కరోనా కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. ఇక ఇప్పుడు ఈ సినిమాను వచ్చేనెలలో విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రమోషన్స్ వేగం పెంచారు. అందులో భాగంగా 'అచ్చ తెలుగందమే .. 'అంటూ సాగే ఫస్టు సింగిల్ ను రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఫస్టు సింగిల్ ను రేపు వదలనున్న విషయాన్ని తెలియజేస్తూ సాంగ్ ప్రోమోను వదిలారు. గిబ్రాన్ సంగీతం .. రామజోగయ్య శాస్త్రి సాహిత్యంతో సిద్ శ్రీరామ్ ఆలపించిన ఈ పాట యూత్ ను ఆకట్టుకునేలా ఉంది. రొమాంటిక్ యాంగిల్ లో వదిలిన ఈ సాంగ్ పడుచు మనసులను పట్టేసేలా ఉంటుందనే విషయాన్ని ఈ ప్రోమో స్పష్టం చేస్తోంది. సినిమాలో రొమాన్స్ పాళ్లు కాస్త ఎక్కువగానే ఉన్నాయనే హింట్ ఇస్తోంది. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అశోక్ సరసన నాయికగా నిధి అగర్వాల్ అందాలను ఆరబోయనుంది. ఇప్పుడిప్పుడే ఈ బ్యూటీ ఒక్కో అవకాశాన్ని అందుకుంటూ స్పీడ్ పెంచుతోంది. గ్లామర్ పరంగా ఈ సుందరికి యూత్ లో విపరీతమైన క్రేజ్ ఉంది. ప్రస్తుతం పవన్ సరసన 'హరి హర వీరమల్లు' కూడా చేస్తోంది. ఈ సినిమా తరువాత ఈ పిల్ల గ్రాఫ్ మారిపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పవన్ జోడీగా చేస్తున్న సినిమా కూడా ఈ సినిమా ప్రమోషన్స్ లో హెల్ప్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ మధ్య కాస్త ఒళ్లు చేసిన ఈ అమ్మాయి పొద్దు తిరుగుడు పువ్వులా .. ముద్దపెరుగు బువ్వలా కనిపిస్తోంది. మొత్తానికి తెలుగు తెరకి మరో పెద్ద ఫ్యామిలీ నుంచి కుర్ర హీరో వస్తున్నాడు. ఆ(క్)లెడీ కుర్రాడు డాన్సులతో .. ఫైట్లలో శిక్షణ తీసుకున్నాడని అంటున్నారు. అలాగే నటనలోను పాఠాలను బాగానే వంటబట్టించుకున్నాడని చెబుతున్నారు. కాస్త కష్టపడాలేగానీ నిలదొక్కుకోవడం పెద్ద కష్టమేం కాదు. ఇప్పుడున్న కుర్ర హీరోలంతా తమకంటూ ఒక స్టైల్ ను .. ప్రత్యేకతను చాటుకోవడానికి ట్రై చేస్తున్నారు. ఆ రూట్లో అశోక్ గల్లా కూడా వెళితే సక్సెస్ అయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. కసితో ఈ కుర్రాడు చేసిన కసరత్తు ఎంతో చూడాలి మరి.

# సెమీస్‌కు చేరే జట్లు ఇవే...



టీ20 ప్రపంచకప్- 2021లో భాగంగా ప్రస్తుతం సూపర్ 12 పోటీలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు ఇయాన్ ఛాపెల్ సెమీఫైనల్‌కు చేరే జట్లను ముందుగానే అంచనావేశాడు. ఈ మెగా టోర్నీలో గ్రూప్-1 నుంచి ఇంగ్లండ్, వెస్టిండీస్, గ్రూప్-2 నుంచి భారత్, పాకిస్తాన్ సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయని ఛాపెల్ అభిప్రాయపడ్డాడు. అయితే గ్రూప్ 2 లో మిగితా జట్లకు కేన్ విలియమ్సన్ నేతృత్వంలోని న్యూజిలాండ్ జట్టు గట్టి పోటీస్తుంది అని అతడు తెలిపాడు."గ్రూప్ 2నుంచి సెమిఫైనల్‌కు చేరే అవకాశాలు భారత్, పాకిస్తాన్‌లకు ఎక్కువగా ఉన్నాయి. అయితే వారికి న్యూజిలాండ్ నుంచి గట్టి పోటీ ఉంటుంది. కాగా గ్రూప్ 1లో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా,వెస్టిండీస్ నాలుగు జట్లు పటిష్టంగా ఉన్నాయి. అంచనా వేయడం చాలా కష్టం. కానీ ఇంగ్లండ్, వెస్టిండీస్‌లకు సెమీఫైనల్‌కు చేరే అవకాశాలు ఉన్నాయి. టీ20 ప్రపంచకప్ ఒక లాటరీ లాంటిది అని ఛాపెల్ ఓ స్పోర్ట్స్ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. టీ20 వరల్డ్‌కప్-2021 టోర్నీలో భాగంగా పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఓటమిపై ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు ఇయాన్ ఛాపెల్ స్పందించాడు. యూఏఈలో ఆడిన అనుభవం పాక్‌ను గెలిపించింది అని అతడు తెలిపాడు."గత దశాబ్దం నుంచి యూఏఈలో పాకిస్తాన్ క్రికెట్ ఆడుతుంది. అక్కడి పరిస్థితులు ఆ జట్టుకు బాగా తెలుసు. యూఏఈలో ఆడిన అనుభవం పాక్‌కు ఈ టోర్నమెంట్‌లో బాగా కలిసిస్తోంది అని భావిస్తున్నాను. మరోవైపు ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో జట్టులోని చాలా మంది ఆటగాళ్లు అక్కడ ఆడినందున భారత్‌కు కూడా ప్రయోజనం చేకూరుతుంది" అని ఛాపెల్ తెలిపాడు.

**టీమిండియా ఓడిపోవడం మంచిదే అయ్యింది.. ఎందుకంటే..**

టీ20 ప్రపంచకప్-2021 టోర్నీలోని తొలి మ్యాచ్‌లో ఓటమి టీమిండియాకు మేలే చేస్తుందని ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ అన్నాడు. అపజయాలు విజయాలకు బాటలు వేస్తాయని అభిప్రాయపడ్డాడు. కాగా అక్టోబరు 24న పాకిస్తాన్‌తో దుబాయ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో కోహ్లి సేనకు ఘోర పరాభవం ఎదురైన సంగతి తెలిసిందే. ప్రపంచకప్ టోర్నీల్లో ఇప్పటి వరకు పాక్ చేతిలో అపజయం ఎరుగని భారత జట్టు అనూహ్యంగా 10 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. ఈ నేపథ్యంలో గ్రేమ్ స్వాన్ క్రికెట్.కామ్‌తో మాట్లాడుతూ.. "కొన్ని సార్లు టోర్నీ ఆరంభంలోనే భారీ తేడాతో ఓడిపోవడం మంచే చేస్తుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**